APTEL/2023/88044

తెలుగు దినపత్రిక

# పీపుల్స్ మోటివేషన్
People's Motivation

ఆంధ్రప్రదేశ్ / తెలంగాణ

సంపుటి : 01 | సంచిక : 249 | ఎడిటర్ : ఎం. రమేష్ | శుక్రవారం, ఆగస్టు 9, 2024 | పేజీలు : 08 | వెల రూ. 5.00/-



# విత్తనాల కొరత లేకుండా చర్యలు

వరద ప్రభావిత రైతులకు 36 కోట్ల ఇన్ పుట్ సబ్సీడీ

ఉద్యాన పంటల ఉత్పత్తి పెరిగేలా చర్యలు

ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లను ప్రోత్సహించాలని నిర్ణయం

వ్యవసాయ అధికారులతో సీఎం చంద్రబాబు సమీక్ష

అమరావతి,ఆగస్ట్8(పీపుల్స్ మోటివేషన్): రాష్ట్రంలో విత్తనాల కొరత లేకుండా చర్యలు చేపట్టాలని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆదేశించారు.. రాష్ట్రంలో సాగవుతున్న ప్రాంతాన్ని వంద శాతం ఈ క్రాపింగ్ కింద నమోదు చేయాలని స్పష్టం చేశారు.. జులై నెలలో వరదల వల్ల ప్రభావితమైన రైతులకు 36 కోట్ల ఇన్ పుట్ సబ్సీడీని రాష్ట్ర విపత్తు నిధి నుంచి మంజూరు చేయాలని ఆదేశించారు. వ్యవసాయంలో డ్రోన్ల వినియోగాన్ని పెంచాలని క్లారిటీ ఇచ్చారు.. ప్రస్తుతం రాష్ట్రంలో 140 డ్రోన్లు మాత్రమే వినియోగిస్తు న్నామని వెల్లడించారు అధికారులు. ఇక, కరవు ప్రాంతాల్లో మాయిశ్చర్ ను ఉపగ్రహ ఛాయాచిత్రాల ద్వారా పరిశీలన చేసి చర్యలు చేపట్టాల్సిందిగా ఆదేశాలు ఇచ్చారు.. వచ్చే రెండేళ్లలో రాష్ట్రంలో ఉద్యాన పంటల ఉత్పత్తి పెరిగేలా చర్యలు చేపట్టాల్సిందిగా సూచించారు. ఇక, మైక్రో ఇరిగేషన్ మాన్యుఫాక్చరింగ్ పార్కు ఏర్పాటుపై ప్రతిపాదనలు సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు సీఎం చంద్రబాబు నాయుడు.. నిమ్మ, టమాటా, మామిడి వంటి ఉత్పత్తుల విలువ జోడించే విధంగా ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లను ప్రోత్సహించాలన్న సీఎం. ఈ ఉత్పత్తుల ఎగుమతులకు ఎయిర్ కార్గో సేవల్ని అందించేలానూ చూడాలని స్పష్టం చేశారు.. త్వరలోనే ప్రారంభించనున్న అన్నదాత సుఖీభవ కార్యక్రమం అమలుపై కొన్ని సూచనలు చేశారు.. లబ్ధిదారులను గుర్తించేందుకు మొబైల్ నెంబర్లు- బ్యాంకు ఖాతాలను అనుసంధానానికి ఆదేశించారు..

ఈ మేరకు జియో ట్యాగ్ చేయాలని సూచించారు. వ్యవసాయ, మార్కెటింగ్ శాఖలపై సచివాలయంలో జరిగిన సమీక్షా సమావేశంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు కీలక ఆదేశాలు జారీ చేశారు. రైతులకు విత్తనాల కొరత లేకుండా చూడాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. నూటికి నూరు శాతం ఈ-క్రాప్ నమోదు చేయాలని, జులైలో భారీవర్షాలకు దెబ్బతిన్న పంటలకు రూ.36 కోట్లు ఇన్ పుట్ సబ్సీడీ అందివ్వాలని కోరారు. పొలాల్లో పురుగు మందులు పిచికారికి డ్రోన్లు వినియోగించేలా ప్రోత్సహించాలని, రాష్ట్రంలో డ్రోన్ టెస్టింగ్ కేంద్రం ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని సూచించారు. రాష్ట్రంలో మైక్రో ఇరిగేషన్ పరికరాల తయారీకి మానుఫ్యాక్చరింగ్ పార్కు ఏర్పాటుకు కృషి చేస్తానని అన్నారు. కాగా ఈ సమీక్షలో వ్యవసాయ యాంత్రీకరణ, గ్రామ సచివాలయ ఉద్యోగులు మాతృ సంస్థలకు అనుసంధానం చేయడం వంటి పలు కీలక అంశాలపై చర్చించారు. వ్యవసాయ శాఖ మంత్రి అచ్చెన్నాయుడితో పాటు అధికారులు పాల్గొన్నారు.



## పార్టీ కోసం కష్టపడ్డవారికి నామినేటెడ్ పదవులు

త్వరలోనే సభ్యత్వ నమోదు కార్యక్రమం

వైసిపి ఫేక్ ప్రచారాన్ని తిప్పి కొట్టాలని నిర్ణయం

పోలవరం, అమరావతి నిర్మాణాలపై చర్చ

తెలంగాణలో పార్టీ బలోపేతంపైనా దృష్టి

ప్రజల భాగస్వామ్యంతో త్వరలో జన్మభూమి-2

టీడీపీ పొలిట్‌బ్యూరో సమవేశంలో కీలక నిర్ణయాలు

5



## ఏనుగుల దాడి నుంచి కాపాడండి

కుంకీ ఏనుగులను పంపి.. నిలువరించండి

కర్నాటక అటవీ మంత్రికి పవన్ వినతి

అడవులను నరికి స్మగ్లింగ్ చేసేలా సినిమాలు

గతంలో అడవులను కాపాడేలా హీరోయిజం

పవన్ కళ్యాణ్ వ్యాఖ్యలతో వైరల్ అవుతున్న విమర్శలు

పుష్పలో బన్నీ పాత్ర గురించే అంటూ కామెంట్లు

ఎవరినీ ఉద్దేశించి కాదంటూ నాదెండ్ల వివరణ

బెంగుళూరు,ఆగస్ట్8(పీపుల్స్ మోటివేషన్) : చిత్తూరు, శ్రీకాకుళం జిల్లాలో ఏనుగుల బీభత్సం సృష్టించి, ఆస్థి, ప్రాణ నష్టం చేస్తున్న క్రమంలో ఏనుగుల మందలను తరిమేందుకు, కర్ణాటక నుంచి కుంకీ ఏనుగులను పంపించాలని కర్ణాటక రాష్ట్రాన్ని ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ కోరారు. ఈ మేరకు కర్ణాటక ప్రభుత్వంతో మాట్లాడేందుకు పవన్ బెంగళూరు వెళ్లారు. కర్ణాటక అటవీశాఖ మంత్రి ఈశ్వర్ బి. ఖండ్రేతో భేటీ అయ్యారు. చిత్తూరు జిల్లా పరిధిలోను, పార్వతీపురం ప్రాంతంలోను ఏనుగులు ఊళ్ళ మీదకు వచ్చి పంటలు నాశనం చేస్తున్నాయని, ప్రాణ హాని కలిగిస్తున్నాయని, ఇలా వచ్చే ఏనుగులను తిరిగి అడవిలోకి తరిమేందుకు కుంకీ ఏనుగులు అవసరమని బి. ఖండ్రేకు తెలిపారు. ఈ కుంకీ ఏనుగులు కర్ణాటక అటవీ శాఖ పరిధిలో ఉన్నాయని, కొన్ని కుంకీ ఏనుగులు ఏపీకి ఇవ్వాలని పవన్ కల్యాణ్ కోరారు. దీనిపై కర్ణాటక అటవీ శాఖ మంత్రి సానుకూలంగా స్పందించినట్లు

- మిగతా 6లో..




## అమెరికాలో కొనసాగుతున్న సీఎం పర్యటన

కాగ్నిజెంట్,చార్లెస్ స్క్వాబ్ తదితర సంస్థలకు స్వాగతం

బిజీ బిజీగా గడుపుతున్న రేవంత్ రెడ్డి

పెట్టుబడులు రాబట్టడమే లక్ష్యంగా ఒప్పందాలు

డల్లాస్ చేరుకున్న సిఎం రేవంత్ బృందం

మహాత్ముడికి ఘనంగా నివాళులు

5



## ప్రకాశం బ్యారేజీకి కొనసాగుతున్న వరద

40 గేట్లు ఎత్తి దిగువకు నీటి విడుదల

పులిచింతల 11 గేట్లు ఎత్తడంతో భారీగా వరద

6



## మెజార్టీ లేకున్నా ఎమ్మెల్సీ ఎన్నికల్లో టిడిపి పోటీ

సిఎం స్థాయిలో ఉన్న వ్యక్తే కొనుగోళ్లకు ఎత్తులు

చంద్రబాబుకు విలువలు లేవు..ఆ దుర్మార్గుడితో పోరు

చంద్రబాబులా హామీ ఇచ్చివుంటే మనమే గెలిచే వాళ్లం

స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులతో జగన్ భేటీ

4

## రేషన్ కేటాయింపుల్లో ఎపికి అన్యాయం

రాష్ట్రంలో 1.47 కోట్ల కుటుంబాలకు రేషన్ సరఫరా

లక్ష టన్నుల కందిపప్పు ఇవ్వాలని కేంద్రాన్ని కోరాం

ఢిల్లీలో కేంద్రమంత్రులను కలిసిన నాదెండ్ల మనోహర్

5

## యధాతథంగా.. ద్రవ్య పరపతి విధానం

రెపోరేటులో మార్పు లేదన్న ఆర్‌బిఐ

యూపిఐ చెల్లింపుల్లో 5 లక్షల వరకు అనుమతి

వివరాలు వెల్లడించిన గవర్నర్ శక్తికాంత్ దాస్

4

తెలుగు దినపత్రిక

పీపుల్స్ మోటివేషన్
People's Motivation

# జిఎస్టీపై తలబిరుసు సమాధానం !

జిఎస్టీ ద్వారా జీవితాలు అతలాకుతలం అవుతున్నా..మోడీ ప్రభుత్వం కించిత్ కూడా పాశ్చాత్తాపం చెందడం లేదు. స్వయంగా కేంద్రమంత్రి నితిన్ గడ్కరీ, బెంగాల్ సిఎం మమతా బెనర్జీ ప్రస్తావించిన తరవాత పార్లమెంటులో పలువురు సభ్యులు దీనిని ప్రస్తావించారు. అయితే ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ చెప్పిన సమాధానం చూస్తే షాక్ కావాల్సిందే. ఆమె సమాధానం తలబిరుసుతో ఉన్నట్లుగా ఉంది. జీవిత, ఆరోగ్య బీమాపాలసీ ప్రీమియంలపై జీఎస్టీని రద్దు చేయాలంటూ డిమాండ్లు ఊపందుకున్న వేళ ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ స్పందించిన తీరు చూశాక..మోడీ ప్రభుత్వం ప్రజల సమస్యలను ప్రస్తావించడ మే తప్పన్న రీతిలో ఉన్నట్లుగా అర్థం చేసుకోవాలి. ప్రజల నుంచి వచ్చిన సమస్యలపై చర్చించేది లేదన్న ట్లుగా మోడీ బృందం తీరు ఉంది. జిఎస్టీ అంశంపై కేంద్రమంత్రి నితిన్ గడ్కరీ ఆమెకు తొలుత లేఖ రాయగా.. తాజాగా ఇండియా కూటమి సభ్యులు లోక్‌సభ వేదికగా బీమాపై జీఎస్టీ తొలగించాలంటూ డిమాండ్ చేశారు. ఈ క్రమంలో లోక్‌సభలో ఆమె మాట్లాడారు. జీఎస్టీ విధానం అమల్లోకి రాకముందు కూడా బీమా ప్రీమియంలపై పన్ను వసూలు అయ్యేదని నిర్మలా సీతారామన్ గుర్తు చేశారు. ఇదేమీ కొత్త విషయం కాదని, అన్ని రాష్ట్రాల్లో ఇది అమలైందని పేర్కొన్నారు. జీఎస్టీ విధానం అమల్లోకి వచ్చాకా అదే విధానం కొనసాగిందన్నారు. ఇలా వసూలైన జీఎస్టీలో 75 శాతం రాష్ట్రాలకే వెళుతోందని పేర్కొన్నారు. ఇక్కడ ఆందోళన చేస్తున్న వారు ఎప్పుడైనా తమ రాష్ట్రాల్లో దీనిపై చర్చించారా అని ఎదురు ప్రశ్నించారు. ఒకరు లేవనెత్తిన అంశంపై ఏకంగా 200 మంది ఎంపీలు పార్లమెంట్ వేదికగా అదే పల్లవి అందుకున్నారని ఎద్దేవా చేశారు. అంటే గడ్కరీ లేవనెత్తిన అంశంపై అంటూ...ఎకసక్కెంగా మాట్లాడారు. అంతేగాకుండా లోక్‌సభలో నిర్మలా సీతరామన్ లాగా సమాధానం చెబితే...ప్రజలు మెచ్చరని గుర్తించాలి. పార్లమెంటులో బిజెపి, ఎన్‌డిఎ కూటమి సభ్యులు కూడా ఆమెకు మద్దతుగా చప్పట్లు కొట్టడం మరింత దారుణంగా చూడాలి. నిజంగా ఈ అంశంపై విపక్షాలు గట్టిగా నిలబడి కొట్లాడాల్సిందే. జిఎస్టీ వల్ల జరుగుతున్న నష్టాలను, అనర్థాలను చర్చించాల్సిందే. కానీ విపక్షాలు కూడా పెద్దగా పట్టించుకోలేదు. మొత్తంగా మోడీ తాను తెచ్చిన జిఎస్టీకి మూడే కొమ్ములు అన్న చందంగా తలబిరుసుగా,నిరంకుశంగా ముందుకు సాగుతున్నారు. ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రస్తావిస్తే ..అది ప్రభుత్వానికి వ్యతిరేకంగా ప్రతిపక్ష పార్టీలన్నీ కలిసి లోక్‌సభలో కొట్లాడుతున్నాయన్న భావనలో మోడీ బృందం ఉంది. ఈ అంశం అధికార బిజెపికి, ఇండియా కూటమికి మధ్య ఉన్న సమస్య కాదని ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్ గుర్తించటనట్లుగా లేదు. ఇది కోట్లాదిమంది భారతీయులు ఎదుర్కొంటున్న సమస్య. గత పదేళ్లుగా మోడీ ఏ అంశంపైనా చర్చించడం లేదు. పక్కనున్న బంగ్లాలో రిజర్వేషన్ల చిచ్చు.. ఆ దేశ ప్రధానిని పారిపోయేలా చేసింది. ఇలాంటి సమయంలో కూడా ఇక్కడ సమస్యల ను ప్రస్తావిస్తే చర్చ చేయకుండా పొగరుగా సమాధానం ఇవ్వడం సరికాదు. నిజంగా జిఎస్టీ కావచ్చు.. మరేదైనా సమస్య కావచ్చు...మోడీ ఈ మధ్య మాట్లాడడం లేదు. దేశంలో ఎంతగా ఆందోళన వ్యక్తం అవుతున్నా పట్టించుకోవడం లేదు. మోడీ అధికారంలోకి రాకముందు మన్మోహన్ సింగ్‌ను మౌనముని అంటూ పలు సందర్భాల్లో విమర్శించారు. ఇప్పుడు అదే మోడీ మౌనిగా మారారు. తాను చేయదల్చు కున్నది చేస్తున్నారు. చెప్పదల్చుకున్నదే మాట్లాడుతున్నారు. పార్లమెంట్ జరుగుతున్నా హాజరు కావడం లేదు. ప్రజల సమస్యలు ప్రస్తావనకు వచ్చినా పట్టించుకోవడం లేదు. మన్మోహన్‌ను నిందించిన మోడీ తాను చేస్తున్నదేమిటో గుర్తించడం లేదు. వైఫల్యాలను బీజేపీ అంగీకరించ వలసిన సమయం ఇక ఆసన్నమైంది. పార్లమెంటులో మాట్లాడరాదనే మౌనవ్రతాన్ని ప్రధాని మోదీ చేపట్టారని గతంలో అనేకమార్లు విపక్షాలు విమర్శించాయి. నితిన్ గడ్కరీ బిజెపిలోనూ, మంత్రివర్గంలోనూ ఎంతో సీనియర్ నేత. బిజెపి అధ్యక్షుడిగా కూడా పనిచేశారు. అలాంటి కేంద్రమంత్రి ప్రస్తావించిన జిఎస్టీ అంశాన్ని చర్చించాల్సిన అసవరం ఉంది. విపక్షాలు కూడా గాలివాటంగా జిఎస్టీ ఎత్తేయాలని కోరడం లేదు. బీమాపైనా, చేనేతలపైనా జిఎస్టీ ఎత్తేయాలని కోరుతున్నారు. తాజాగా చేనేతపై జిఎస్టీ ఎత్తేసేందుకు కేంద్రంతో మాట్లాడుతానని ఎపి సిఎం చంద్రబాబు కూడా హామీ ఇచ్చారు. అంటే పన్నులు కారణంగా ప్రజలు పడుతున్న ఇబ్బందులను గుర్తించే ఆయన ఈ మాట అన్నారని భావించాలి. నిజానికి పార్లమెంటులో చర్చలో పాల్గొని ప్రస్తావించే ప్రతి ఒక్కరి ప్రసంగంలోని విషయాలను సానుకూలంగా తీసుకోవాలి. వాటికి సానుకూల వైఖరితోనే సమాధానం చెప్పాలి. ప్రజలకు భరోసా కల్పించాలి.కానీ మోడీకి అలాంటి ఉద్దేశ్యం లేదని మరోమారు స్పష్టమయ్యింది. ప్రజలు నేరుగా పార్లమెంటుకు వచ్చి ప్రశ్నలు అడగరు. ఎవరో ఒక ఎంపి ద్వారా ప్రశ్నలు అడుగుతారు. పత్రికల ద్వారా సమాచారం చేరవేస్తారు. గ్రామస్థాయి నుంచి పట్టణస్థాయి వరకు వివిధ వేదికల ద్వారా చర్చకు పెడతారు. కానీ నిర్మలా సీతారామన్ దీనిపై ఆలోచిద్దామని చెప్పకుండా పెడసరంగా..ఇది ఇలాగే ఉంటుందని సమాధానం చెప్పడం దారుణం కాక మరోటి కాదు. నిజానికి ప్రజలు ఇలాంటి సమాధానం కోరుకోవడం లేదు. జిఎస్టీ వడ్డింపులు తగ్గించబోమని చెప్పడానికి కారణాలు ఏమిటో చెప్పాలి. ఎందుకు తగ్గించరో చెప్పాలని కోరుకుంటున్నారు. ఇలాంటి సమాధానాల ద్వారా దేశానికి ఎలాంటి సందేశం ఇవ్వబోతున్నారో ప్రజలు ఎదురుచూస్తున్నారు. ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్ సమాధానం తేలిపోయిన తరవాత జనానికి మరోమారు మోడీపై విశ్వాసం పోవడం ఖాయం. అడ్డూ అదుపు లేకుండా సాగుతున్న జిఎస్టీ వడ్డింపులపై కేంద్ర ప్రభుత్వం గట్టి చర్యలు తీసుకుంటుందని ఎవరైనా ఆశిస్తారు. కానీ ఎలాంటి జవాబుదారీ వహించక పోవడం దారుణం కాక మరోటి కాదు. ప్రజలను పట్టిపీడిస్తున్న పన్నులు వ్యవస్థను సంస్కరించాల్సిందే. తుమ్మినా దగ్గినా జిఎస్టీ అంటే ప్రజలు బతికేదెలా అని ఆలోచించాలి. దీనిపై ఎసి గదుల్లో కొందరు చర్చించకుండా గ్రామాలకు వచ్చి చర్చించాలి. పలు వేదికల ద్వారా చర్చ చేయాలి. అప్పుడే అసలు సంగతులు బయటకు

# బిజెపితో బంధమా..విలీనమా..

**కెసిఆర్ అడుగులు హస్తిన వైపు పడేనా?**
**బిఆర్ఎస్, బిజెపిల రాజకీయాలపై సర్వత్రా చర్చ**

**హైదరాబాద్,ఆగస్ట్8(పీపుల్స్ మోటివేషన్):**

పదేళ్లపాటు అధికారం అనుభవించి, ఆర్థికంగా బలపడి, ఇష్టారాజ్యంగా పాలన చేసిన బిఆర్ఎస్‌కు ప్రస్తుత పరిస్థితులు మింగుడు పడడం లేదు. వరుసగా మూడోసారి అధికారం తమదే అనుకున్న తరుణంలో పరిస్థితులు తలకిందులు అయ్యాయి. ఈ ఉక్కపోతను కెసిఆర్ కుటంబం భరించకోలేక పోతున్నది. ఓ వైపు విచారణ, మరోవైపు విమర్శలు, ఇంకోవైపు కూతురు కవిత జైలకు వెళ్లడం వంటి విషయాలు కెసిఆర్‌ను పుండులాగా సలుపుతున్నాయి. అందుకే దీనిని నుంచి బయటపడే మార్గాల గురించి ఆలోచన చేస్తున్నట్లు చర్చ సాగుతోంది. ప్రధానంగా రేవంత్ సిఎం కావడాన్ని బిఆర్ఎస్ తట్టుకోలేక పోతోంది.ఈ క్రమంలో దీనికి చెక్ పెట్టాలన్న ఆలోచన నుంచే బిజెపికి చేరువ కావాలన్న సూత్రం పుట్టిందన్న ప్రచారం సాగుతోంది. ప్రధానంగా రెండు విషయాలపై బిఆర్ఎస్‌లో అంతర్గతంగా చర్చ సాగుతున్నట్లు తెలుస్తోంది. ఇక్కడ బిఆర్ఎస్ అంటే కెసిఆర్, కెటిఆర్, హరీష్ రావు లాంటి వారి మధ్యనే అని గుర్తించాలి. ప్రస్తుత రాజకీయాలను మలుపు తిప్పాలన్నదే వారి ఎత్తుగడగా ఉంది. ఇందులో భాగంగా కేంద్రంతో సఖ్యతగా ఉంటూ కవితను విడిపంచుకోవడం...బిఆర్ఎస్ మద్దతను బిజెపికి తెలపడం. అయితే దీనివల్ల కేవలం కవిత మాత్రమే బయటకు రావచ్చు. కానీ అధికారం దక్కదు. అందుకే ఎన్‌డిఎలో చేరేందుకు స్కెచ్ వేసినట్లు తెలుస్తోంది. బిఆర్ఎస్‌కు రాజ్యసభలో నలుగురు సభ్యులు ఉన్నారు. ఐదుగురిలో కేశవరావు జారుకుని రాజీనామా చేశారు. బిజెపికి కూడా రాజ్యసభలో బలం అవసరం. నలుగురు రావడం అంటే తక్కువేమీ కాదు. అందుకే బిఆర్ఎస్, బిజెపిల విలీనపై ఈ మధ్య పుంఖానుపుంఖాలుగా వార్తలు తన్నుకు వస్తున్నాయి. ఇందులో ప్రధానంగా బిఆర్ఎస్ విలీనం అయితే కెసిఆర్ కేంద్రమంత్రిగా ఢిల్లీకి వెళ్లడం.. ఒప్పందంగా ఉండొచ్చు. తదుపరి కాలంలో తెలంగాణలోనూ షిండేలను సృష్టించి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయడం అన్నది కావచ్చు. ఇవన్నీ కూడా ఊహాజనితమే అయినా ..వీటిచుట్టే ప్రచారం సాగుతోంది. బిఆర్ఎస్, బిజెపి ఎమ్మెల్యేలు కలిశాక వారి బలం ఇప్పుడున్న పరిస్థితుల్లో 36కు చేరుకుంటుంది. ఓ పదిమంది కాంగ్రెస్‌లో చేరారు. వారిని కూడా వెనక్కి రప్పించడం జరగవచ్చు. లేదా కోర్టు ద్వారా ఒకరిద్దరి పై వేటు వేయించి దారికి తెచ్చుకునే ప్రయత్నాలు కూడా



సాగుతున్నాయి.అందుకే తెలంగాణ రాజకీయాలు ఊహించని మలుపులు తిరుగుతున్నాయనే భ్రమను కలిపిస్తున్నాయి. భారత రాష్ట్ర సమితి, భారతీయ జనతా పార్టీల మధ్య విలీన చర్చలు జరుగుతున్నాయని విస్తృత ప్రచారం ప్రారంభమయింది. గత నాలుగైదు నెలలుగా ఈ తరహా ప్రచారం అంతర్గతంగా సాగుతోంది.కానీ ఎవరూ స్పందించలేదు. ఇప్పుడు ప్రచారం మరింత ఊపందుకుంది. అయితే బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ మాత్రం ఖండించారు. ఓ ట్వీట్ ద్వారా వీలైనంత బలంగా విలీనం ప్రచారం కుట్ర పూరిత ప్రచారం అన్నారు కానీ.. ఆ వాదనలో బలం ఉందని రాజకీయవర్గాలు భావించడం లేదు. బీఆర్ఎస్ పార్టీ విలీనంపై జరుగుతున్న ప్రచారాన్ని తిప్పి కొట్టడానికి బీఆర్ఎస్ వ్యూహాత్మక నిర్లక్ష్యం ప్రదర్శిస్తోంది. అందుకే ఎక్కువ మంది విలీన చర్చలు నిజమేనని అనుకుంటున్నారు. గత నెలలో బీఆర్ఎస్ పార్టీకి చెందిన ముఖ్య నేతలు కేటీఆర్, హరీష్ రావు ఢిల్లీకి వెళ్లారు. కొన్ని కీలక సమావేశాలు ఉన్నప్పటికీ వారు ఢిల్లీలో మకాం వేశారు. వారు ఎవరితో సమావేశమయ్యారో ఎవరికీ తెలియదు. వీరి ఢిల్లీ టూర్‌పై కాంగ్రెస్ పార్టీ సెటైర్లు వేసింది. రేవంత్ రెడ్డి అయితే పార్టీని తాకట్టు పెట్టడానికి వెళ్లారని విమర్శించారు. బీజేపీ నేతల కోసం పడిగాపులు పడుతున్నారని మండిపడ్డారు. బీజేపీతో కలిసేందుకు ప్రయత్నిస్తున్నారని విమర్శలు గుప్పించారు. అయితే ఈ విషయంలో బీఆర్ఎస్ వైపు నుంచి ఎలాంటి స్పందన రాలేదు. ఇప్పుడు తాజాగా మరోసారి కేటీఆర్, హరీష్ రావు ఢిల్లీకి వెళ్లారు. ఒక్క రోజు కొంత సేపు కవితతో తీహార్ జైల్లో ములాఖత్ అయ్యారు. మిగిలిన రోజుల్లో ఏం చేస్తున్నారో .. ఎవరితో సమావేశం అవుతున్నారో స్పష్టత లేదు. పార్టీ ఫిరాయించిన ఎమ్మెల్యేలపై అనర్హతా వేటు వేయించేందుకు న్యాయనిపుణులతో చర్చిస్తున్నట్లుగా ఓ సారి ఫోటో రిలీజ్ చేశారు. అందుకోసం రోజుల తరబడి అక్కడ ఉండాల్సిన అవసరం లేదు. వీరు బీజేపీ పెద్దలతో రహస్యంగా విలీన ప్రతిపాదనపై చర్చలు జరుపుతున్నారన్న బలమైన సమాచారం బయటకు రావడంతో కొంత మంది నేరుగా ఈ విషయాన్ని ప్రచారం చేస్తున్నారు. నిజానికి నిప్పులేనిదే పొగరాదు. ఎక్కడో ఒకచోట్‌ఏదో ఒక సందర్భం లేకుండా ఇలాంటి వార్తలు రావు. బీజేపీ, బీఆర్ఎస్ మధ్య ఎలాంటి విలీనం చర్చలు జరగకపోతే.. ఈ విషయాన్ని ఖండించడానికి రెండు పార్టీలు ఎందుకు తటపటాయిస్తున్నాయన్నది రాజకీయవర్గాల నుంచి వస్తున్న మొదటి ప్రశ్న. నిర్మోహమాటంగా ఖండించడానికి బీఆర్ఎస్ ముఖ్య నేతలు సిద్ధంగా లేరు.కీలక నేతలు ప్రతి రోజూ తెలంగాణ భవన్ లో ప్రెస్మీట్లు పెడుతున్నారు కానీ.. బీజేపీతో పొత్తు లేదా విలీనం అంటూ జరుగుతున్న ప్రచారంపై స్పందించడానికి నిరాకరిస్తున్నారు. కేటీఆర్ కూడా ఓ ట్వీట్ పెట్టారు కానీ.. బీజేపీతో ఎలాంటి సంబంధాలు ఉండవని ఖచ్చితంగా చెప్పడం లేదు. తెలంగాణ కోసం పోరాడతామని చెబుతున్నారు. నిప్పు లేనిదే పొగ రాదన్నట్లుగా ఢిల్లీలో ఏదో జరుగుతోందని సులువుగా అర్థమైపోతుంది. స్వయంగా మజ్లిస్ పార్టీ చీఫ్ అసుద్దన్ ఓవైసీ కూడా ఈ అంశంపై బీఆర్ఎస్‌ను ప్రశ్నించినా స్పందన లేదు. నిజానికి బీజేపీ, బీఆర్ఎస్ మధ్య పొత్తు లేదా విలీనం అంశంపై చాలా కాలంగా చర్చలు జరుగుతున్నాయని బీఆర్ఎస్సే నేరుగా ప్రతిపాదన పెట్టినా.. తెలంగాణ బీజేపీ నేతల్లో ఏకాభిప్రాయం లేకపోవడం వల్లనే డీల్ ఆలస్యమవుతోందని ఢిల్లీ వర్గాలు గట్టిగా చెబుతన్నాయి. బీఆర్ఎస్‌తో తీవ్రంగా పోరాడిన ముగ్గురు ఎంపీలు ఆ పార్టీతో ఎలాంటి సంబంధాలు పెట్టుకున్నా సరే అది బీజేపీకి నష్టం చేస్తుందని గట్టిగా వాదిస్తున్నారని అంటున్నారు. అయితే బీఆర్ఎస్ పార్టీకి ఉన్న క్యాడర్ బలం..బీజేపీకి కలసి వస్తుందని.. కింది స్థాయి వరకూ పార్టీ నిర్మాణం ఏర్పడుతుందని .. ఇతర సీనియర్ నేతలు పాజిటివ్‌గా స్పందిస్తున్నారని అంటున్నారు. ఈ కారణంగానే చర్చల్లో ప్రతిష్టంభన ఏర్పడిందని వ్యతిరేకించే వారిని .. సముదాయించి అధికారిక ప్రకటన చేస్తారని చెబుతున్నారు. అయితే బీఆర్ఎస్ క్యాడర్ మాత్రం.. అలాంటి పరిస్థితి రాదని.. కేసీఆర్ తన పార్టీని ఇతర పార్టీల్లో కలిపేంత నిర్ణయం తీసుకోరని అనుకుంటున్నారు. మొత్తంగా ఏం జరుగుతుందో వేచి చూడాల్సిందే.

# కుటుంబ బంధం అవసరం ! (ఆధ్యాత్మిక చింతన )

**తిరుమల,ఆగస్ట్8(పీపుల్స్ మోటివేషన్):**

ఆవు తనకు కట్టిన పలుపుతాడు తెంచుకొని వెళ్ళిపోవాలనుకుని అటు, ఇటు చుట్టూ తిరుగుతుంది. చివరకు తన పరిధి తాను తెలుసుకుని చతికిలపడుతుంది. మన నిస్సహాయతను మనం తెలుసుకోవాలి. అదే సమయంలో మనల్ని ఇలా ఉంచినవాడి గొప్పదనాన్ని గ్రహించాలి. ఎవరిమీదో కోపం వస్తుంది. ఎందుకో కోపం వస్తుంది. పారిపోవాలని అనిపిస్తుంది. తాళ్లతో కట్టి బంధించరెవరూ! అయినా వెళ్ళలేం. ఎందుకు, ఎవరు మనల్ని ఆపుతున్నారో తెలియదు.చూసిన ముఖాలే చూస్తూ, ఆడిన మాటలే ఆడుతూ, అదే తిండి తింటూ, నిద్రపోతూ తెల్లవారి లేచి మరో కొత్త సూర్యుడి కోసం ఎదురు చూస్తాం. ఇదే బంధం. మౌలికంగా మనిషి బతకడంలోనే బంధం ఉంది. అందం ఉంది. బంధాలు అందంగా ఉంటాయి. అవి ఇనుప గొలుసులైతేనేం, బంగారు గొలుసులైతేనేం- బంధాలు బయటకు కనిపించవు. తల్లి వెంట బిడ్డ, బిడ్డ వెంట తల్లి... ఆ బిడ్డ ఎదిగి తల్లి... అలా అందరూ కలిసి కుటుంబం. ఈ కుటుంబాలన్నీ ఈశ్వరుడివే.పరిస్థితులు అనుకూలంగా లేనప్పుడు మనసు వైరాగ్యానికి గురి అయినప్పుడు తట్టా బుట్టా సర్దుకుని ఎక్కడికైనా వెళ్ళిపోదాం అనిపిస్తుంది. కానీ, అంతలోనే ఆగిపోవాలి అనిపిస్తుంది. కనపడకుండా ఆపేదెవరని ఆలోచిస్తే- మనవాళ్లే కాదు... మనమధ్యలో ఉండే బంధమే అనిపిస్తుంది. కుటుంబ బంధం అంత బలమైనది. అందులోనే అందం, ఆనందం ఉంది.

# సాహసోపేత నిర్ణయాలకు పూనుకోవాలి

**సమస్యలపై మరింత శ్రద్ధ పెట్టాలి**
**సత్తాచాటే నిర్ణయాలతోనే మోడీకి ఇమేజ్**

**న్యూఢిల్లీ,ఆగస్ట్8(పీపుల్స్ మోటివేషన్) :**

మోడీ అధికారంలోకి వచ్చిన తరవాత గత పదేళ్లు పాలన అవినీతిరహితంగా సాగుతుందన్న పేరు వచ్చింది. అలాగే సాహసోపేత నిర్ణయాలు కూడా తీసుకుని సత్తా చాటింది. అయోధ్య, కాశ్మీర్, ట్రిపుల్ తలాక్ విషాయల్లో సాహసోపేత నిర్ణయాలు తీసుకున్నారు. ఇకపోతే ఇంకా పట్టిపీడిస్తున్న సమస్యలు అనేకం ఉన్నాయి. ప్రధానంగా నిరుద్యోగం, ఆహారభద్రత, కరెంట్,నీళ్లు వంటి సమస్యలపై దృష్టి సారించాలి. నదీజలాల విషయంలో సాహసోపేత నిర్ణయాలు తీసుకోవాల్సి ఉంది. నదుల అనుసంధానం ద్వారా దేశాన్ని బలోపతేం చేసే దిశగా అడుగులు వేయాలి. జిఎస్టీ లాంటి పన్నులు విధానంపై చర్చించాలి. మోడీ రెండోసారి అధికారంలోకి వచ్చిన తరవాత తీసుకుకున్న నిర్ణయాలు చరిత్రలో నిలిచిపోతాయి. ట్రిపుల్ తలాక్‌కు మంగళం పాడడంతో ముస్లిం మహిళలకు వివాహబంధం విషయంలో భరోసా దక్కింది. అలాగే కాశ్మీర్‌లో 370 ఆర్టికల్ రద్దు కూడా సాహసోపేత నిర్ణయంగా నిలిచి పోనుంది. మోడీ సర్కార్ సాహస నిర్ణయాలకు వెనకాడదని రుజువు చేసుకుంది. సర్జికల్ స్ట్రయిక్స్ చేసి దాయాది దేశాన్ని ప్రపంచంలో దోషిగా నిలబెట్టిన ఘనత మోడీదే అని చెప్పక తప్పదు. అలాగే అవినీతి మరక అంటకుండా మోదీ దేశాన్ని పాలించారన్న ప్రశంసలు ఉన్నాయి. ఇకపోతే కరోనా వ్యాక్సిన్ తయారీ, ప్రోత్సాహంలో దేశం అతిపెద్ద విజయం సాధించిందనే చెప్పాలి. దేశంలోని ప్రజలకు ఉచితంగా వ్యాక్సిన్ అందించడమే గాకుండా,అనేక దేశాలకు ఉచితంగా వ్యాక్సిన్ అందించి ఆపన్నహస్తం అందచేసింది. ఇలాంటి తరుణంలో మూడోసారి అధికారంలోకి వచ్చారు. అయితే ప్రజలు పూర్తి మెజార్టీ ఇవ్వలేదు. అందువల్ల ప్రజలు మెచ్చే విధంగా పాలన సాగించాల్సి ఉంది. ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై ప్రధానంగా దృష్టి సారించాలి. క్షేత్రస్థాయి నుంచి సమాచారం తెప్పించుకోవాలి. సమస్యలు గుర్తించాలి. గత పదదేళ్లుగా తనవైపు వేలెత్తి చూపే అవకాశం లేకుండా మోదీ జాగ్రత్తగా వ్యవహరించారు. ఎక్కడా ఒక కుంభకోణం అన్నది లేకుండా పాలన సాగిస్తున్న తీరు ప్రజలనుంచి అభినందనలు వస్తున్నాయి. తన వ్యక్తిగత ప్రతిష్టను పెంచుకునేలా చేసుకున్నారు. అయితే పాలనలో మాత్రం అంతగా దూసుకుని పోవడం లేదు. ప్రధానంగా నోట్లరద్దు, జిఎస్టీతో ప్రజలకున్న ఆశలు అడియాశలయ్యాయి. కాంగ్రెస్ విముక్త భారత్ లక్ష్యంగా చేస్తున్న రాజకీయాలు సత్ఫలితాలు ఇవ్వక పోగా కాంగ్రెస్‌ను బలోపేతం చేశాయి. ఇది బిజెపికి దెబ్బగానే చెప్పుకోవాలి. కాంగ్రెస్ పార్టీని దెబ్బతీసే క్రమంలో చేస్తున్న పనులన్నీ దేశహితం కోసమేనని సరిపెట్టుకోలేం. భారతీయ జనతా పార్టీ విస్తరణ కాంక్ష మోదీ, షాలను నిలవనివ్వడం లేదు. ఈ క్రమంలోనే తప్పటడుగులు వేస్తున్నారు. ఇదో గుణపాఠం కావాలి. దేశమంతటా అన్ని రాష్ట్రాలలో భారతీయ జనతాపార్టీ పతాకం రెపరెపలాడాలన్నది ఈ ఇరువురి నాయకుల కోరిక! కాంగ్రెస్ పార్టీ ఇప్పుడు నీతి వాక్యాలు వల్లె వేస్తోంది గానీ దేశ రాజకీయాలు ఇవ్వాళ ఇంతలా భ్రష్టుపట్టి పోవడానికి ఆ పార్టీనే ప్రధాన కారణం. గతంలో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ నేతృత్వంలోని యూపీఏ ప్రభుత్వం కూడా అనేక అడ్డదారులు తొక్కింది. రాష్ట్రాలలో అధికారం నిలబెట్టుకోవడం కోసం లేదా అధికారంలో ఉన్న ఇతర పార్టీల ప్రభుత్వాలను కూల్చడం కోసం కాంగ్రెస్ పార్టీ చేయని అరాచకం లేదు. ప్రస్తుత ప్రధాని నరేంద్ర మోదీ గుజరాత్ ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు ఆయనపైకి ఇంటెలిజెన్స్ బ్యూరో వంటి సంస్థలను ప్రయోగించి నానా ఇబ్బందులు పెట్టారు. సీబీఐ ద్వారా విచారణలు జరిపించారు. ఇప్పుడు కాంగ్రెస్ అడుగుజాడలలో అదే నరేంద్ర మోదీ, అవే ఏజెన్సీలను కాంగ్రెస్ నాయకుల మీదకు ప్రయోగిస్తున్నారు. పార్టీ ఫిరాయింపులను ప్రోత్సహించడంలో గానీ, ప్రభుత్వ ఏజెన్సీలను దుర్వినియోగం చేయడంలో గానీ కాంగ్రెస్ ఎప్పుడూ ముందుండేది. ఇప్పుడు అదే పంథాను బిజెపి అనుసరిస్తోంది. బిజెపి ఇప్పుడు మిగతా పార్టీలకు భిన్నంగా ఏమీ లేదు. రాజకీయ స్వార్థం కోసం ఎంతకైనా తెగిస్తోంది. ఆ తెగువ పాలనలో కూడా చూపితే దేశం బాగుపడుతుంది. కేవలం విపక్షాలపైనే విచారణలు అన్న ఆరోపణలు పోవాలి. తప్పు చేసిన వారిపై విచారణలు జరగాలి. ఎపిలో జగన్, తెలంగాణలో కెసిఆర్ లాంటి వారి అవినీతిపైనా చర్యలు ఉండాలి. రాజకీయాలు పక్కన పెట్టి దేశం గురించి ఆలోచనచేయాలి. అప్పుడే బిజెపి పట్ల ఆదరణ పెరుగుతంది.

తెలుగు దినపత్రిక
పీపుల్స్ మోటివేషన్
People's Motivation
శుక్రవారం । ఆగస్టు । 9 । 2024


# పర్యావరణ పరిరక్షణ కోసం మొక్కలు నాటండి






**చెన్నూరు, ఆగస్టు 08 (పీపుల్స్ మోటివేషన్):-**

ప్రస్తుత వాతావరణంలో పెరుగుతున్నటువంటి కాలుష్యాన్ని నిర్మూలించేందుకు మరియు పర్యావరణ సమతుల్యత దెబ్బతినకుండా ఉండేందుకు ప్రతి ఒక్కరుమొక్కలు నాటడం తమ వంతు బాధ్యతగా తీసుకోవాలని మదర్ తెరిసా ఫౌండర్ విజయ్ కుమార్ అన్నారుజిబి వివిఎస్ ది రిజర్వేషన్ సేవా సమితి ఆధ్వర్యంలో చెన్నూరు పెన్నా నది సమీపంలోని ఆంజనేయ పురం గ్రామంలో గురువారం మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పల్లె ప్రాంతంలోనే కాకుండా పట్టణ పరిసరాల్లో విద్యాసంస్థల్లో ప్రభుత్వ కార్యాలయాల్లో మొక్కల పెంపకాన్ని చేపట్టాలని సూచించారు. ఈ కార్యక్రమంలో భాగంగా జిపిపీవీఎస్ ది రిజర్వేషన్ సేవా సమితి వ్యవస్థాపకుడు మరియు ఎన్ఎస్ఎస్ వాలంటీర్ అయిన అశోక్ కుమార్ మాట్లాడుతూ ఈ విధంగా పర్యావరణ దెబ్బతినకుండా ఉండేందుకు గాలిలో ఆక్సిజన్ శాతం తక్కువ అయితే రాబోయే రోజుల్లో మానవ మనగడకు ఇబ్బందులు ఎదురవుతాయని మరియు వాతావరణ సమస్యలతో దెబ్బ తినడం వలన సకాలంలో వర్షం పడడం లేదని ఇలాంటి విపత్తుల నుంచి బయట పడాలంటే ప్రతి ఒక్కరూ మొక్కలు నాటడంకై నడుము బిగించాలన్నారు . ఈ కార్యక్రమంలో సంస్థ సభ్యులు మరియు ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు విక్రమ్ శరణ్ తదితరులు పాల్గొన్నారు.

## కానాలలో ఘనంగా నాగుల చవితి



**నంద్యాల, ఆగస్టు 08 (పీపుల్స్ మోటివేషన్):-**

నాగుల చవితి పర్వదినంను పురస్కరించుకొని నంద్యాల మండలం మేజర్ గ్రామ పంచాయతీ కానాల గ్రామంలో వెలిసిన శ్రీవల్లి సుబ్రహ్మణ్య స్వామి దేవస్థానంలో భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. పుట్టకు పాలుపోసి స్వామివారికి పూజలు చేసి తమ మొక్కుబడులు తీర్చుకున్నారు. నంద్యాల పట్టణంతో పాటు చుట్టుప్రక్కల గ్రామాల నుంచి వచ్చిన అనేక మంది భక్తులు ఈ పూజలలో పాల్గొన్నారు.

## అన్ని విధాలుగా చిన్న కంబలూరు పాఠశాల అభివృద్ధి కమిటీ చైర్మన్ రాజశేఖర్‌రెడ్డి

**రుద్రవరం/నంద్యాల, ఆగస్టు 08 (పీపుల్స్ మోటివేషన్):-**



పాఠశాల అభివృద్ధి విద్యార్థుల కు మెరుగైన సౌకర్యాలు కల్పించివిద్యాభివృద్ధి కి కృషి చేస్తానని ఏకగ్రీవంగా నూతనంగాఎన్నికైన పాఠశాల యాజమాన్యం కమిటీ చైర్మన్ జంగా రాజశేఖర్ రెడ్డి తెలిపారు. గురువారం చిన్నకంబలూరు గ్రామంలోని పాఠశాలలో జరిగిన యాజమాన్య కమిటీ ఎన్నికలో జంగా రాజశేఖర్ రెడ్డిని విద్యార్థుల తల్లిదండ్రులు ఆయనను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. పాఠశాల కమిటీ చైర్మన్ ఎన్నికైన ఆయనను పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఆనందరాజు ఇతర ఉపాధ్యాయులు గ్రామ నాయకులు విద్యార్థుల తల్లిదండ్రులు అభినందించారు.

## అమెరికాలో పెట్టుబడుల వేట

**సిఎం రేవంత్ చర్చలు ఫలవంతం**
**పలు కంపెనీలు పెట్టుబడులకు సిద్ధం**
**ఒప్పందాలన్నీ ఖచ్చితంగా తెలంగాణ అభివృద్ధి కోసమే**
**నిరాధార వార్తలపై ఐటి సెక్రటరీ జయేశ్ రంజన్ వివరణ**


**హైదరాబాద్, ఆగస్ట్ 8 (పీపుల్స్ మోటివేషన్):**



ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అమెరికా పర్యటనలో భాగంగా తెలంగాణకు వచ్చిన పెట్టుబడులన్నీ బోగస్ అంటూ ప్రచారం జరగడాన్ని ఐటి శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ జయేష్ రంజన్ తీవ్రంగా ఖండించారు. మొన్న, నిన్న చేసిన కొన్ని పెట్టుబడుల ప్రకటనలు బోగస్ అని వార్తలు వెల్లువెత్తిన నేపథ్యంలో జయేశ్ రంజన్ వీడియో ద్వారా వివరణ ఇచ్చారు. తెలంగాణకు పెట్టుబడులన్నీ వాస్తవమే అని స్పష్టం చేశారు. పెట్టుబడుల కోసం అమెరికాలో సీఎం రేవంత్ రెడ్డి బిజీగా ఉన్నారని తెలిపారు. ముఖ్యమంత్రి అమెరికాలో చేస్తున్న మీటింగుల విశ్వసనీయత మీద తెలంగాణ ప్రజలకు ఎటువంటి అనుమానాలు అవసరం లేదని తెలిపారు. అన్ని విషయాలు చెక్ చేసిన తర్వాతే మీటింగ్‌లు చేస్తున్నామని జయేష్ రంజన్ వీడియోలో స్పష్టం చేశారు. ఫైనాన్షియల్ సర్వీసెస్లో ప్రపంచంలో పేరొందిన చార్లెస్ స్క్వాబ్ కంపెనీ హైదరాబాద్‌లో తమ సంస్థను నెలకొల్పేందుకు సిద్ధమైంది. అమెరికా పర్యటనలో భాగంగా డల్లాస్‌లో ముఖ్యమంత్రి ఏ.రేవంత్ రెడ్డి, మంత్రి శ్రీధర్‌బాబుతో ఈ కంపెనీ సీనియర్ ఎగ్జిక్యూటివ్‌లు డెన్నిస్ హోవార్డ్, రామ బొక్కా సారథ్యంలో ప్రతినిధులు చర్చలు జరిపారు. ఈ సందర్భంగా టెక్నాలజీ అండ్ డెవలప్?మెంట్? సెంటర్ ఏర్పాటుపై కీలక నిర్ణయాన్ని వెల్లడించారు. హైదరాబాద్‌లో ఈ కేంద్రం ఏర్పాటుకు రాష్ట్ర ప్రభుత్వం తగిన సహకారం అందిస్తుందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి హామీ ఇచ్చారు. కంపెనీ కార్యకలాపాలను వేగవంతం చేసేందుకు అవసరమైన మార్గదర్శనం చేస్తామని చెప్పారు. తమ కంపెనీ విస్తరణకు రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన మద్దతుకు కంపెనీ ప్రతినిధులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ టెక్నాలజీ సెంటర్ ఏర్పాటుకు ఛా÷–ల్గ÷స్ స్క్వాబ్ తుది అనుమతుల కోసం వేచి చూస్తోంది. త్వరలోనే తమ ప్రతినిధి బృందాన్ని హైదరాబాద్‌కు పంపించనున్నట్లు తెలిపింది. ఈ కంపెనీ విస్తరణతో ఆర్థిక సేవల రంగంలోనూ హైదరాబాద్ ప్రపంచం దృష్టిని ఆకర్షించనుంది. మరోవైపు అమెరికా పర్యటనలో భాగంగా ముఖ్యమంత్రి రేవంత్.. ఆపిల్ సంస్థ హెడ్ క్వార్టర్ ఆపిల్ పార్క్ వెళ్లనున్నారు. ఆపిల్ మ్యానిఫాక్చర్ టీమ్‌తో సీఎం రేవంత్ రెడ్డి, మంత్రులు శ్రీధర్ బాబు, కోమటిరెడ్డి వెంకటరెడ్డి భేటీ కానున్నారు. ట్రినేట్ కంపెనీ సీఈఓతో చర్చించనున్నారు. ఆరమ్ గ్రూప్ ఆఫ్ కంపెనీతో భేటీ అయి హైదారాబాద్‌లో ఆ కంపెనీ డేటా సెంటర్స్ విస్తరణ కోసం చర్చలు నిర్వహించనున్నారు. పలువురు టెక్ కంపెనీల ప్రతినిధులతో లంచ్ మీటింగ్‌లో పాల్గొననున్నారు. అంగెన్ సంస్థ సీనియర్ లీడర్‌షిప్‌తో పెట్టుబడులపై చర్చలు నిర్వహించ నున్నారు. ఎలక్ట్రానిక్ పరికరాల సంస్థ రెనేశాస్ తో, మ్యానిఫాక్చర్ సంస్థ అమాట్‌తో ఇన్వెస్ట్‌మెంట్‌పై చర్చలు నిర్వహించనున్నారు. పలు బిజినెస్ సంస్థలతో రౌండ్ టేబుల్ సమావేశంలో రేవంత్ పాల్గొననున్నారు. అలాగే బుధవారం ప్రపంచ బ్యాంకు అధ్యక్షుడితో చర్చలు సఫలం కానున్నాయి. ఫోర్త్ సిటీ, మూసీ సుందరీకరణ, స్కిల్ యూనివర్సిటీ, ప్రజారోగ్య రంగాల్లో సహకారం అందించడానికి ప్రపంచ బ్యాంకు అంగీకరించింది. నిపుణులతో ఉన్నత స్థాయి కమిటీకి నిర్ణయం తీసుకుంది. హైదరాబాద్‌లోని జీనోమ్ వ్యాలీలో 400 కోట్లు పెట్టుబడితో ఇన్జెక్టబుల్ తయారీ కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. వెయ్యి మందికి ఉద్యోగాలు కల్పించేలా వివింట్ సంస్థ కృషి చేస్తామని తెలిపింది. లైఫ్ సైన్సెస్ రంగంలో ఇన్నోవేషన్ డెవలప్మెంట్ కోసం కార్నింగ్ కంపెనీ సహకరిస్తామని తెలిపింది. అంకాలజీ, క్రిటికల్ కేర్ విభాగంలో సహకారం కోసం కార్నింగ్ కంపెనీతో తెలంగాణ సర్కార్ ఎంఓయూ కుదుర్చుకుంది.

## అహోబిలం పాఠశాలల్లో విద్యా కమిటీచైర్మన్ ఎన్నికలు

**విద్యా కమిటీ చైర్మన్ లుగా గూడూరు లక్ష్మీ నరసయ్య, సానేశైలజ, కులయమ్మలు**



**ఆళ్లగడ్డ, ఆగస్టు 08 (పీపుల్స్ మోటివేషన్):-**

ఆళ్లగడ్డ మండలంలోని అహోబిలం జడ్ పి పి, ప్రాథమికోన్నత పాఠశాల, గిరిజన ఆశ్రమ పాఠశాల లో జరిగిన విద్యా కమిటీ ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ ఏకగ్రీవంగా ఎన్నికయింది. ఉమ్మడి జిల్లాల టిడిపి మాజీ ఉపాధ్యక్షులు గూడూరు సంజీవరాయుడు, టీడీపి నాయకులు ఎస్ ల్ రమణ, పెనుగొండ వీరభద్రుడు, గంగాధర్, సానే, అంజి ఆధ్వర్యంలో ఆళ్లగడ్డ ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ ఆదేశాల మేరకు గురువారం నిర్వహించిన పాఠశాల యాజమాన్య కమిటీ ఎన్నికల్లో ఏకగ్రీవంగా చైర్మన్ లు గా గూడూరు లక్ష్మీ నరసయ్య ( జెడ్ పి హెచ్ స్కూల్) పెనుగొండ లక్ష్మీదేవి వైస్ చైర్మన్, సాని శైలజ ఎంపీపీ స్కూల్ చైర్మన్ గా, వైస్ చైర్మన్ గా శ్రీహరి, అలాగే గిరిజన ఆశ్రమ పాఠశాల చైర్మన్గా ఐ. కులాయమ్మ, వైస్ చైర్మన్ గా పెద్దన్న లు ఎన్నికయ్యారు. పాఠశాల యాజమాన్య కమిటీ ఏకగ్రీవంగా ఎన్నికైన సభ్యులు తమను ఎంతో నమ్మకంతో ఎన్నుకున్నందుకు పాఠశాలల అభివృద్ధికి పాటు పడతామని ఈ సందర్భంగా వారు తెలిపారు. పాఠశాలల నూతనచైర్మన్ వైస్ చైర్మన్ లు ఎమ్మెల్యే భూమా అఖిలప్రియకు కృతజ్ఞతలు తెలిపారు.

## కర్నూలు టూ బళ్లారికి హైవే ఏర్పాటు చేయండి

**కేంద్ర మంత్రి గడ్కరీకి వినతిపత్రం సమర్పించిన ఎం.పి నాగరాజు**

**డిల్లీ, ఆగస్టు 08 (పీపుల్స్ మోటివేషన్):-**



కర్నూలు నుంచి బళ్లారి కి హైవే ఏర్పాటు చేయడంతో పాటు జిల్లాలోని 167 జాతీయ రహదారి పనులను త్వరగా పూర్తి చేయాలని కేంద్ర రోడ్డు రవాణా మరియు రహదారుల శాఖ మంత్రి నితిన్ గడ్కరీని కర్నూలు ఎం.పి బస్తిపాటి నాగరాజు కోరారు.. ఢిల్లీలోని కేంద్ర మంత్రి కార్యాలయంలో ఆయన్ని కలిసి వినతి పత్రం సమర్పించారు...ఈ సందర్భంగా ఎం.పి నాగరాజు మాట్లాడుతూ మంత్రాలయం నుంచి బళ్లారి కి వెళ్లే 167 జాతీయ రహదారి పనులు తీవ్ర జాప్యాన్ని ఎదుర్కొంటున్నాయని, ప్రత్యేకంగా ఈ రహదారిలో ఆదోని మరియు ఆలూరు మీదుగా ఉన్న రోడ్డు మార్గం పరిస్థితి అధ్వానంగా మారడంతో ప్రయాణికుల వాణిజ్యం, మరియు రవాణా పై ప్రభావం చూపుతుందని, ఈ కీలకమైన మార్గాన్ని ప్రత్యేక చొరవ తీసుకొని త్వరగా చేయాలన్నారు.. అలాగే కర్నూలు నుంచి బళ్లారి కి హైవే ఏర్పాటు చేయాలని, ఈ రహదారి ఆంధ్రప్రదేశ్ మరియు కర్ణాటక రాష్ట్రాలను అనుసంధానించడంలో కీలక పాత్ర పోషిస్తుందని, వాణిజ్యం, పర్యాటకం మరియు ప్రాంతీయ అభివృద్ధి ని సులభతరం చేస్తుందన్నారు.. ఇక ఈ రెండు విషయాలను కేంద్ర మంత్రి గడ్కరీ దృష్టికి తీసుకుపోయాయని, దీని పై ఆయన సానుకూలంగా స్పందించారని ఎంపీ నాగరాజు తెలిపారు.

## ఎస్ఎల్‌బిసిని నిర్లక్ష్యం చేసిన గత ప్రభుత్వం

**మండలి చైర్మన్ గుత్తా సంచలన వ్యాఖ్యలు**

**నల్లగొండ,ఆగస్ట్8(పీపుల్స్ మోటివేషన్):**

సుంకిశాల నిధులను ఎస్ఎల్ బీసీ సొరంగానికి కేటాయించి ఉంటే ఇప్పటికే పూర్తి జరిగి, గ్రావిటీ ద్వారా ఈజీగా వాటర్ వచ్చే అవకాశం ఉండేదని శాసన మండలి ఛైర్మన్ గుత్తా సుఖేం దర్ రెడ్డి అన్నారు. నల్లగొండ జిల్లాలో పెండింగ్ ప్రాజెక్టులను గత ప్రభుత్వం పట్టించుకోకుండా, పూర్తిగా నిర్లక్ష్యం చేసిందన్నారు. పెండింగ్ ప్రాజెక్టులపై సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ఇప్పటికే అధికారులను ఆదేశించి, పనులు పూర్తి చేసేలా చర్యలు తీసుకుంటున్నారని తెలిపారు. వచ్చే రెండేళ్లలో నక్కలగండి, పెండ్లిపాకల ప్రాజెక్టులను పూర్తిచేసి హైదరాబాద్‌కు తాగునీరు అందిస్తామన్నారు. పిల్లాయిపల్లి, ధర్మారెడ్డి, బునాదిగాని ఆయకట్టు కాలువల నిర్మాణం, లైనింగ్ పూర్తి చేయాలన్నారు

## చిత్తూరు నగరంలో గురువారం డయల్ యువర్ ఎమ్మెల్యే

**చిత్తూరు, ఆగస్టు 8పీపుల్స్ మోటివేషన్):**

చిత్తూరు నగరపాలక కార్యాలయంలో గురువారం ఉదయం డయల్ యువర్ ఎమ్మెల్యే కార్యక్రమానికి ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా పాల్గొన్నారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ బైక్ , దొంగతనం, శానిటేషన్, రోడ్లు మరమ్మతులు, డ్రైనేజీ, ఉపాధి అవకాశం వంటి పలు సమస్యలను నగర ప్రజలు ఎమ్మెల్యే దృష్టికి ఫోన్ ద్వారా తెలియజేశారు. అనంతరం వాటిని తక్షణం పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.

తెలుగు దినపత్రిక

పీపుల్స్ మోటివేషన్

People's Motivation

## జగన్‌ను పార్టీ నేతలే భరించలేరు

**విలువల గురించి మాట్లాడితే నవ్వొస్తుంది**

**మంత్రి అనగాని సత్యప్రసాద్ విమర్శలు**

**అమరావతి,ఆగస్ట్8(పీపుల్స్ మోటివేషన్):**

జగన్‌ను ప్రజలు మాత్రమే కాదు..ఆయన పార్టీ నేతలూ భరించలేక పోతున్నారని మంత్రి అనగాని సత్యప్రసాద్ వ్యాఖ్యలు చేశారు. గురువారం మీడియాతో మాట్లాడుతూ.. పులివెందుల ఎమ్మెల్యే జగన్ రెడ్డి విలువలు, విశ్వసనీయత గురించి మాట్లాడుతుంటే నవ్వొస్తోందన్నారు. ఇచ్చిన హామీల్లో కేవలం 13 శాతం మాత్రమే అమలు చేసి ప్రజలకు పంగనామాలు పెట్టిన జగన్‌కు హామీల అమలులో చంద్రబాబును విమర్శించే నైతిక హక్కు లేదన్నారు. జగన్‌ను రాష్ట్ర ప్రజలు మాత్రమే కాదు.. ఆయన పార్టీ నేతలు కూడా వద్దనుకుంటున్నారన్నారు. పోలోమని పెద్ద సంఖ్యలో వైసీపీ నేతలు రాజీనామాలు చేసి ఇతర పార్టీల్లో చేరుతున్నారని తెలిపారు. ఈ కారణంగానే విశాఖ కార్పొరేషన్ స్టాండింగ్ కౌన్సిల్లోనే కాదు.. స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎన్నికల్లోనూ వైసీపీకి ఓటమి ఖాయమని స్పష్టం చేశారు. వరుసగా అన్ని ఎన్నికల్లో ఓడిపోతున్నా జగన్‌కు తత్వం బోధపడడం లేదని, ఓటమి నుంచి పాఠాలు నేర్చుకోవడం లేదన్నారు. జగన్ రెడ్డి తాను మళ్లీ సీఎం కుర్చీపైన కూర్చుంటాననంటూ పగటి కలలు కంటున్నారన్నారు. జగన్ మానసిక స్థితి బాగోలేదని ఆయన చెల్లెలు చెప్పింది నిజమే అన్నట్లుగా ఆయన వ్యవహరిస్తున్నారని వ్యాఖ్యలు చేశారు. ప్రభుత్వం ఏర్పడిన రెండు నెలలకే అన్ని వ్యవస్థలూ విఫలమయ్యాయని జగన్ పిచ్చి ప్రేలాపనలు పేలుతున్నారని మండిపడ్డారు. వైసీపీ పాలన చేసిన గాయాల నుంచి ప్రజల ఇంకా కోలుకోలేదన్నారు. 11 సీట్ల మాత్రమే ఇచ్చి ఆ పార్టీని అధ:పాతాళానికి తొక్కిన ప్రజలు... నిజంగా జగన్ ప్రజలకు బిర్యానీనే పెట్టి ఉంటే ఎన్నికల్లో ప్రజలెందుకు దారుణంగా ఓడించారని మంత్రి అనగాని సత్యప్రసాద్ ప్రశ్నించారు. పారిస్ ఒలింపిక్స్‌లో కాంస్య పతకం సాధించిన భారత హాకీ జట్టును మంత్రి అనగాని సత్యప్రసాద్ అభినందనలు తెలిపారు. 52 ఏళ్ల తర్వాత వరుసగా రెండు ఒలింపిక్స్‌లలో కాంస్య పతకం సాధించడం దేశానికి గర్వకారణమని వ్యాఖ్యానించారు. ఈ పతకం భారత జాతీయ క్రీడ అయిన హాకీకి పునర్వైభవం తీసుకొస్తుందని విశ్వాసం వ్యక్తం చేశారు. కెప్టెన్ హర్మన్ ప్రీత్, కీపర్ శ్రీజేష్ పతక సాధనలో కీలక పాత్ర పోషించారని మంత్రి అభినందించారు. హాకీ జట్టు ఇచ్చిన స్ఫూర్తితో భారత క్రీడాకారులు మరిన్ని పతకాలు గెలవాలని ఆశిస్తున్నట్టు ఆయన చెప్పారు.

## ఏపీలో శాంతిభద్రతలు దారుణం

**మాచర్లలో వైసిపి కార్యకర్త కిడ్నాప్**

**మాజీ మంత్రి అంబటి రాంబాబు విమర్శలు**

**అమరావతి,ఆగస్ట్8(పీపుల్స్ మోటివేషన్):**

ఏపీలో శాంతిభద్రతలు దారుణంగా పడిపోయాయని మాజీ మంత్రి అంబటి రాంబాబు వ్యాఖ్యలు చేశారు. గురువారం మీడియాతో మాట్లాడుతూ... ఒంటేరు నాగరాజు అనే వైసీపీ కార్యకర్తని కిడ్నాప్ చేశారన్నారు. మాచర్ల నియోజకవర్గానికి చెందిన నాగరాజు ప్రాణభయంతో వినుకొండ వచ్చారని తెలిపారు. పోలీసు వ్యవస్థ పని చేస్తోందా? అని ప్రశ్నించారు. ఎస్పీతో కూడా మాట్లాడామని అన్నారు. నాగరాజుకు ఏ విధమైన హాని జరిగినా ముఖ్యమంత్రి చంద్రబాబు బాధ్యత వహించాలన్నారు. బెయిల్ మీద బయట వచ్చి కూరగాయల వ్యాపారం చేసుకుంటున్నారని.. అలాంటి వ్యక్తిని కిడ్నాప్ చేశారని అన్నారు. నాగరాజు కుటుంబ సభ్యులను కొట్టి టీడీపీ గూండాలు కిడ్నాప్‌కు దిగారని మండిపడ్డారు. నడిరోడ్డు మీద హత్యలు, కిడ్నాప్‌లు జరుగుతున్నాయన్నారు. అసలు రాష్ట్రంలో శాంతిభద్రతలు ఉన్నట్టా? లేనట్టా? అని ప్రశ్నించారు. రాష్ట్రాన్ని మణిపూర్, బీహార్‌లాగ మార్చారని విమర్శలు గుప్పించారు. టీడీపీ నేతలు ఏం చేసినా పోలీసులు వారిని ఏమీ అనటానికి వీల్లేదని హోంమంత్రి నుంచే ఆదేశాలు వెళ్లాయన్నారు. రాష్ట్రంలో రెడ్ బుక్ రాజ్యాంగం అమలవుతోందని విరుచుకుపడ్డారు. ఆటవిక రాజ్యం కొనసాగుతోందన్నారు. పోలీసులు వెంటనే స్పందించి నాగరాజును కాపాడాలని మాజీ మంత్రి అంబటి రాంబాబు డిమాండ్ చేశారు.

## తెలంగాణలో రెండురోజుల పాటు తేలికపాటి వర్షాలు

**హైదరాబాద్ వాతావరణ కేంద్రం వెల్లడి**

**హైదరాబాద్,ఆగస్ట్8(పీపుల్స్ మోటివేషన్) :**

తెలంగాణలో రెండురోజుల పాటు అక్కడక్కడ పలుచోట్ల తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురుస్తాయని హైదరాబాద్ వాతావరణ కేంద్రం పేర్కొంది. పలు చోట్ల ఉరుములు, మెరుపులతో కూడిన వర్షాలు కురుస్తాయని.. గంటకు 30 నుంచి 40 కిలోమీటర్ల వేగంతో గాలులు వీస్తాయని తెలిపింది. శుక్రవారం ఆదిలాబాద్, ఆసిఫాబాద్, మంచిర్యాల, నిర్మల్, నిజామాబాద్, జగిత్యాల, కరీంనగర్, పెద్దపల్లి, భూపాలపల్లి, ములుగు, కొత్తగూడెం, ఖమ్మం, నల్గొండ, సూర్యాపేట, మహబూబాబాద్, వరంగల్, హన్మకొండ, జనగామ జిల్లాల్లో అక్కడక్కడ వర్షాలు కురిసే అవకాశం ఉందని పేర్కొంది. ఈ మేరకు ఆయా జిల్లాలకు వాతావరణశాఖ ఎల్లో అలెర్ట్‌ను ప్రకటించింది. ఇదిలా ఉండగా.. గడిచిన 24గంటల్లో రాష్ట్రవ్యాప్తంగా పలు జిల్లాల్లో మోస్తరు వర్షాపాతం నమోదైంది. మెదక్, మహబూబాబాద్, కొత్తగూడెం, ఖమ్మంలో పలుచోట్ల భారీ వర్షాలు కురిశాయి. అత్యధికంగా ఖమ్మం జిల్లా సత్తుపల్లి మండలం గంగారంలో 13.6 సెంటీమీటర్ల వర్షాపాతం రికార్డయ్యింది. సదాశివునిపల్లిలో 8.6లో, సత్తుపల్లిలో 7 సెంటీమీటర్ల వర్షం కురిసింది.

## శ్రీశైలంలో నాటుసారా విక్రయం

**శ్రీశైలం,ఆగస్ట్8(పీపుల్స్ మోటివేషన్):**

నంద్యాల జిల్లా శ్రీశైలం గ్రామంలో నాటు సారా విక్రయిస్తున్న నలుగురు మహిళలను పోలీసులు అరెస్టు చేశారు. ప్రకాశం జిల్లా దోర్నాల మండలం చెర్లోపల్లి గ్రామానికి చెందిన నలుగురు మహిళలు నల్లబోతుల నాగేంద్ర, పిక్కిలి రాజేశ్వరి, నల్లబోతుల రవణమ్మ, నల్లబోతుల లక్ష్మి శ్రీశైలం గ్రామం వాసవి సత్రం వద్దకు వచ్చారని సబ్ ఇన్‌స్పెక్టర్ తెలిపారు. వారిని తనిఖీ చేయగా వారి వద్ద ఉన్న13 లీటర్ల నాటు సారాను స్వాధీనం చేసుకుని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో ఏఎస్ఐ గురువయ్య, రఘునాథుడు, బాలకృష్ణ, మహేష్, శంకర్, అమర్నాథ్ రెడ్డి తదితరులు ఉన్నారు.

# మెజార్టీ లేకున్నా ఎమ్మెల్సీ ఎన్నికల్లో టిడిపి పోటీ

**సిఎం స్థాయిలో ఉన్న వ్యక్తే కొనుగోళ్లకు ఎత్తులు**

**చంద్రబాబుకు విలువలు లేవు..ఆ దుర్మార్గుడితో పోరు**

**చంద్రబాబులా హామీ ఇచ్చివుంటే మనమే గెలిచే వాళ్లం**

**స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులతో జగన్ భేటీ**

**అమరావతి,ఆగస్ట్8(పీపుల్స్ మోటివేషన్):**

ఎమ్మెల్సీ ఎన్నికలో మెజార్టీ లేకుండా టీడీపీ పోటీచేస్తుందంటే దాని అర్థం ఏంటి?.. కొనుగోలుచేసి ఎమ్మెల్సీ ఎన్నికలో గెలవాలని చూస్తోందని వైఎస్సార్‌సీపీ అధినేత, మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మండిపడ్డారు. గురువారం ఆయన ఉమ్మడి విశాఖపట్నం జిల్లా స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో నర్సీపట్నం, పెందుర్తి, పాయకరావుపేట నియోజకవర్గ స్థానిక సంస్థల ప్రజా ప్రతినిధులతో నియోజకవర్గం ఎంపీటీసీ, జడ్పీటీసీలతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా వైఎస్ జగన్ మాట్లాడుతూ, ముఖ్యమంత్రిగా ఉన్న వ్యక్తి ప్రజాస్వామ్యాన్ని కాపాడాలి. సీఎం స్థానంలో ఉన్న వ్యక్తి ఏం చేస్తున్నాడన్నదానిపై సమాజం చూస్తుంది. కాని చంద్రబాబులో అలాంటి విలువలు లేవు. చంద్రబాబు లాంటి దుర్మార్గుడితో యుద్ధంచేస్తున్నాం. 2024 ఎన్నికల్లో చంద్రబాబు ప్రజలను మోసం చేశాడు. సూపర్ సిక్స్ హామీ ఇచ్చాడు, కాని మోసం చేస్తున్నాడు. నీకు రూ.15వేలు, నీకు రూ.18వేలు అని ప్రచారం చేశాడు. ఎన్నికల్లో చంద్రబాబులా హామీలు ఇవ్వాలని నాపై ఒత్తిడి తెచ్చారు. మనం అబద్దాలు చెప్పి, ఆ కిరీటాన్ని మనం నెత్తిన పెట్టుకుంటే మనకు ఏం సంతృప్తి వస్తుంది అంటూ వైఎస్ జగన్ వ్యాఖ్యానించారు. కార్యకర్తల నుంచి, ఎమ్మెల్యేల వరకూ తిరిగి గ్రామాల్లో తిరిగే పరిస్థితి ఉంటుందా?. జగన్ మాట చెప్పాడు, కాని అమలు చేయలేదనే మాట అనిపించుకోకూడదు. మన పార్టీ పేరు చెప్తే కార్యకర్తలు, నాయకులు కాలర్ ఎగరేసుకునేలా ఉండాలి. అందుకే నేను మోసపూరిత హామీలు ఇవ్వలేదు. 2014లో చంద్రబాబు కూడా ఇలాంటి హామీలు ఇచ్చి, మాట తప్పాడు. ఇది ప్రజలకు



అర్థమైంది, అందుకే 2019లో ఆయన డిపాజిట్లు గల్లంతయ్యాయి. 2019లో మనం అధికారంలోకి వచ్చి ఇచ్చిన ప్రతిమాటనూ నిలబెట్టాం. ఇవ్వాల్టికీ ప్రజల దగ్గరకు వెళ్లి మనం ఇది చేశామని చెప్పుకోగలిగాం' అని వైఎస్ జగన్ చెప్పారు.కష్టకాలంలో మనం ఎలా ఉంటున్నామనేది ప్రజలు చూస్తారు. ప్రజలకు మనకు శ్రీరామ రక్షగా ఉంటారు. విలువలు కోల్పోయిన రోజు మనకు ప్రజలనుంచి ప్రశ్నలు ఎదురవుతాయి. విలువలు, విశ్వసనీయతగా మనం అడుగులేశాం. కష్టాలు లేకుండా ఏదీ ఉండదు. చీకటి తర్వాత వెలుగు రాక మానదు. పలానా వాడు మన నాయకుడు అని చెప్పుకునే రీతిలో మనం ఉండాలి. జగన్ గురించి మాట్లాడితే ఎవరిని అడిగినా.. పలావు పెట్టాడు అంటారు. చంద్రబాబు గురించి అడిగితే.. బిర్యానీ పెడతానని మోసం చేశాడని అంటున్నారు. ఇప్పుడు పలావు పోయింది.. బిర్యానీ పోయిందని అంటూ వైఎస్ జగన్ వ్యాఖ్యానించారు. స్కూళ్లు, ఆస్పత్రులను నిర్వీర్యం చేస్తున్నారు. రైతులంతా ఇబ్బందులు పడుతున్నారు. గడపవద్దకే మనం సేవలు అందిస్తే ఇప్పుడు టీడీపీ నాయకుల చుట్టూ తిరగాల్సిన పరిస్థితి. పాలన దెబ్బతింది, లా అండ్ ఆర్డర్ దెబ్బతింది. వ్యవసాయం దెబ్బతింది. చంద్రబాబు ఇచ్చిన హామీలన్నీ అబద్దాలు, మోసాలని తేలిపోతున్నాయి. మీ జగన్ సీఎంగా ఉండి ఉంటే అమ్మ ఒడి, రైతుభరోసా, విద్యాదీవెన, వసతి దీవెన, సున్నావడ్డీ, మత్స్యకార భరోసా అంది ఉండేది. మీ జగన్ సీఎంగా ఉండి ఉంటే.. కాలెండర్ ప్రకారం పథకాలు వచ్చేవి. తేడాను ప్రజలు గమనిస్తూనే ఉన్నారు. ప్రజలకు మనం దగ్గరంగా ఉంటే చాలు. ప్రజలే చంద్రబాబును నామరూపాల్లేకుండా చేసే పరిస్థితి వస్తుంది' అని వైఎస్ జగన్ పేర్కొన్నారు. ప్రభుత్వం నుంచి వేధింపులు ఎదుర్కొంటున్న ప్రతి కార్యకర్తకూ నేను భరోసా ఇస్తున్నాను. వీటిని ఎదుర్కొని ఉన్నప్పుడు ప్రజలు మనల్ని కచ్చితంగా ఆదరిస్తారు. రాజకీయ వేధింపుల్లో భాగంగా నన్ను 16 నెలలు జైలుకు పంపారు. కాని ప్రజలకోసం మనం చేసిన పోరాటాలతో మళ్లీ మంచి స్థానంలో పెట్టారు. ఈ విషయాన్ని అందరూ దృష్టిలో పెట్టుకోవాలి. ధనబలం, అధికార బలంతో చంద్రబాబు దారుణాలు చేస్తున్నాడు. దీన్ని ప్రజలు గమనిస్తున్నారు. అధర్మం, అన్యాయం సాగదన్న సందేశం ఇవ్వాలి. ప్రతి ఒక్కరినీ కొనలేరనే మెసేజ్ పంపాలి' అని వైఎస్ జగన్ సూచించారు. విశాఖపట్నం స్టాండింగ్ కమిటీ ఎన్నికల్లో అన్యాయంగా వ్యవహరించారు. వైఎస్సార్‌సీపీకి చుక్కెదురు అంటూ ఈనాడు పత్రిక ఏదో ఘనకార్యం జరిగినట్టుగా రాసింది. మెజార్టీలేని చోట ప్రలోభాలు పెట్టి, పోలీసులతో భయపెట్టి ఓట్లు వేయించుకున్నందుకు ఘనకార్యమా?. దొంగతనం,



హత్యలు చేస్తే దాన్ని కూడా ఘనకార్యంగా రాసే స్థితిలో ఉన్నారు. చంద్రబాబు ఇలాంటి చెత్త కార్యక్రమాలు చేస్తున్నా కూడా ఘన కార్యాలుగా రాస్తున్నారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో మనం ఇచ్చే తీర్పు చాలా కీలకం అని వైఎస్ జగన్ పేర్కొన్నారు.చంద్రబాబుకు న్యాయం, ధర్మం రెండూ లేవు. తన స్వార్థం కోసం ఏమైనా చెబుతాడు.. చేస్తాడు. అలాంటి దుర్మార్గ వ్యక్తితో మనం యుద్ధం చేస్తున్నాం. విలువలు, విశ్వసనీయతే మనకు ఎప్పుడూ బలం అని వైఎస్ జగన్ అన్నారు. ఉమ్మడి విశాఖ జిల్లా స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎన్నిక నేపథ్యంలో తాడేపల్లిలోని వైయస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయంలో నర్సీపట్నం, పెందుర్తి, పాయకరావుపేట నియోజకవర్గాలకు చెందిన ఎంపీటీసీ, జడ్పీటీసీలతో మాజీ సీఎం జగన్ సమావేశం అయ్యారు. తొలుత నర్సీపట్నం నియోజకవర్గ పార్టీ ప్రజాప్రతినిధులతో సమావేశమైన జగన్, ఆ తర్వాత పెందుర్తి, పాయకరావు పేట నియోజకవర్గాల పార్టీ ప్రతినిధులతో మాట్లాడారు. ఉమ్మడి విశాఖ జిల్లా స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎన్నికలో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీకీ పూర్తి మెజారిటీ ఉంది. మన పార్టీ నుంచి 600కు పైగా జడ్పీటీసీలు, ఎంపీటీసీలు ఉంటే, అదే తెలుగుదేశం నుంచి గెల్చిన వారు 200కు పైబడి మాత్రమే ఉన్నారు. మనకు వాళ్లకు మధ్య 387 స్థానాల తేడా ఉంది. అంత తేడా ఉన్నప్పుడు మామూలుగా సీఎం స్థానంలో ఉన్న వ్యక్తి అక్కడ పార్టీ నుంచి అభ్యర్థిని పెట్టకూడదు. కానీ, అక్కడ టీడీపీ పోటీ చేస్తోంది అంటే దానర్థం.. ప్రజాప్రతినిధుల కొనుగోలుకు సీఎం స్థానంలో ఉన్న వ్యక్తి గ్రీన్ సిగ్నల్ ఇచ్చినట్లేనని అన్నారు. సీఎంగా ఉన్న వ్యక్తి ప్రజాస్వామ్యాన్ని కాపాడాలి. ఆ వ్యక్తికి ధర్మం, న్యాయం అనే పదాలకు అర్థం తెలిసి ఉండాలి. ఆ స్థాయి వ్యక్తి అడుగులు వేసేటప్పుడు.. సమాజం మనల్ని చూస్తుంది కాబట్టి, మనం ఏం చేస్తున్నాం అన్నది ఆలోచన చేయాలి. కానీ ఆయనకు అవేమీ లేవు. దురదృష్టవశాత్తూ మనం చంద్రబాబునాయుడు అనే దుర్మార్గుడితో యుద్ధం చేస్తున్నాం అని అన్నారు.

# యధాతథంగా ద్రవ్య పరపతి విధానం

**రెపోరేటులో మార్పు లేదన్న ఆర్‌బిఐ**

**యూపిఐ చెల్లింపుల్లో 5 లక్షల వరకు అనుమతి**

**వివరాలు వెల్లడించిన గవర్నర్ శక్తికాంత్ దాస్**

**ముంబై,ఆగస్ట్8(పీపుల్స్ మోటివేషన్) :**

విశ్లేషకుల అంచనాలకు అనుగుణంగానే రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా మార్పులు చేర్పులు చేయకుండా కీలక వడ్డీ రేట్లను యథాతథంగా కొనసాగించింది. పరపతి విధాన కమిటీ సమావేశం మంగళవారం జరిగింది. ఈ సమావేశ నిర్ణయాలను గవర్నర్ శక్తికాంత దాస్ గురువారం ప్రకటించారు. రెపోరేటును 6.5 శాతం వద్ద కొనసాగిస్తున్నట్లు ఆయన వెల్లడించారు. 2023 ఫిబ్రవరి నుంచి కూడా రెపో రేటును ఆర్‌బీఐ యథాతథంగా కొనసాగిస్తూ వస్తోంది. ఆర్‌బీఐ బెంచ్‌మార్క్ వడ్డీ రేటును యథాతథంగా కొనసాగించడం ఇది 9వ సారి కావడం గమనార్హం. ద్రవ్యోల్బణం, వృద్ధి అనేవి రెండూ కూడా సమానంగా అభివృద్ధి చెందుతున్నాయి. అయినప్పటికీ ఆహార ధరల విషయమంలో అప్రమత్తత అవసరమని శక్తికాంత దాస్ పేర్కొన్నారు. కేంద్రంలో నరేంద్ర మోదీ నేతృత్వంలో మూడోసారి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ఎంపీసీ తొలిసారిగా సమావేశమైంది. మొత్తంగా చూస్తే ఇది 50వ సమావేశం. ఈ సమావేశంలో మానిటరీ పాలసీ కమిటీలోని ఆరుగురిలో నలుగురు పాలసీ రేటును యథాతథంగా ఉంచాలనే నిర్ణయానికి అనుకూలంగా ఓటు వేశారని శక్తికాంత దాస్ చెప్పారు. ముఖ్యంగా.. సెంట్రల్ బ్యాంక్ నుంచి బ్యాంకులు డబ్బు తీసుకునే రేటు. రెపో రేటు స్థిరంగా ఉండటంతో మన రుణ వాయిదాలో ఎలాంటి మార్పులు చేర్పులు ఉండబోవు. రెపో రేటు తగ్గితే మన హోమ్ లోన్, పర్సనల్ లోన్, కార్ లోన్ వాయిదా తగ్గుతుంది. ఆర్‌బీఐ చివరిసారిగా గతేడాది ఫిబ్రవరిలో రెపో రేటును మార్చింది. ఆ తర్వాత 0.25 శాతం పెరిగి 6.50 శాతానికి చేరుకుంది. ఆహార పదార్థాల ధరలు పెరగడంతో ఏప్రిల్ - మే వరకూ స్థిరంగా ఉన్న ద్రవ్యోల్బణం.. జూన్‌లో మళ్లీ పెరిగింది. 2024-25లో వాస్తవ జీడీపీ వృద్ధిరేటు అంచనా 7.2 శాతం కాగా.. ఒకటి, రెండు, నాలుగో త్రైమాసికంలో 7.2 శాతం, మూడో క్వార్టర్‌లో 7.3 శాతంగా ఉండే అవకాశం. ఆహార ద్రవ్యోల్బణం అనేది నైరుతి రుతుపవనాల కారణంగా దిగొచ్చే అవకాశం ఉంది. 2024-25లో ద్రవ్యోల్బణం 4.5 శాతం.. రెండో త్రైమాసికంలో 4.4శాతం.. మూడో త్రైమాసికంలో 4.7శాతం .. నాలుగో త్రైమాసికంలో 4.3 శాతంగా ఉండవచ్చు. భారత కరెన్సీ రూపాయి మారకం విలువ విషయానికి వస్తే.. పరిమిత శ్రేణిలోనే ఉంది. భారత విదేశీ మారక నిల్వలు ఆగస్టు రెండు నాటికి రికార్డ్ స్థాయిలో 675 బిలియన్ డాలర్లకు చేరవచ్చు. రిటైల్ ఇన్వెస్టర్లకు ప్రత్యామ్నాయ పెట్టుబడి అవకాశాలు ఒకవైపు పెరుగు తుంటే.. బ్యాంకుల డిపాజిట్లు తగ్గుతున్నాయి. ఈ నేపథ్యంలో బ్యాంకులు క్రెడిట్ డిమాండ్‌ను అందుకోవ డంలో ఇబ్బంది పడుతున్నాయి. వ్యక్తిగత రుణ వితరణలో గణనీయ వృద్ధిని పర్యవేక్షించాల్సిన అవసరం ఉంది. టాపప్ లోన్లు, బంగారు రుణాలను ఇవ్వడంలో ఆర్థిక సంస్థలు పెద్దగా నిబంధనలను పాటించడం లేదు. ఇలాంటి వాటిని అరికట్టాలి. ఇక ఆర్బీఐ సమావేశంలో పలు కీలక నిర్ణయాలను తీసుకోవడం జరిగింది. ముఖ్యంగా ట్యాక్స్ టాక్స్ పేమెంట్లపై యూపీఐ లిమిట్‌ను పెంచుతూ నిర్ణయం తీసున్నారు. గతంలో రూ. లక్ష రూపాయలు ఉండే యూపీఐ లిమిట్‌ను రూ.5 లక్షలకు పెంచినట్టు



ఆర్‌బీఐ గవర్నర్ శక్తికాంత దాస్ తెలిపారు. అంటే ఇప్పుడు యూపీఐ ద్వారా ఒకేసారి రూ. లక్ష వరకూ చెల్లించవచ్చు. కేవలం కొద్ది గంటల్లోనే చెక్ క్లియరెన్స్‌కు చర్యలు తీసుకోవాలని ఆర్‌బీఐ గవర్నర్ ప్రతిపాదించారు. పాత ఇంటి రుణంపై అదనపు రుణం తీసుకుంటున్న తీరుపై శక్తికాంత దాస్ ఆందోళన వ్యక్తం చేశారు. ఇకపై ట్యాక్స్ చెల్లించేవారు రూ.5 లక్షల వరకూ ఎలాంటి ఇబ్బందీ లేకుండా యూపీఐతోనే చేయవచ్చు. దీనికి ఎలాంటి అదనపు చార్జీలు వేయరు. చెల్లింపులు డెబిట్ లేదంటే క్రెడిట్ కార్డులతో చేస్తే మాత్రం కొంత చార్జీలు పడతాయి. ఆర్బీఐ ఇలా చార్జీలు పెంచడమనేది కొత్తేమీ కాదు.. గతంలోనూ పలు మార్లు పెంచింది. అంతకుముందు 2023 డిసెంబర్‌లోనే హాస్పిటల్, ఎడ్యుకేషన్ ఇన్‌స్టిట్యూషన్స్ వంటి వాటికి చేసే యూపీఐ పేమెంట్ లిమిట్‌ను ఆర్బీఐ రూ. 5 లక్షలకు పెంచింది. ప్రస్తుతం పన్ను చెల్లింపుల పరిమితిని కూడా పెంచేసింది. సాధారణ యూపీఐ ట్రాన్సాక్షన్ లిమిట్ విషయంలో మాత్రం మార్పేమీ చేయలేదు. అది గరిష్టంగా రూ. లక్ష మాత్రమే ఉంది.

## ఎకగ్రీవంగా స్కూల్ విద్యా కమిటీ చైర్మన్ ఎంపిక

శింగనమల, ఆగస్టు 8పీపుల్స్ మోటివేషన్): శింగనమల మండలం గుమ్మేపల్లి గ్రామపంచాయతీలో టిడిపి పార్టీ సర్పంచ్ దేగల లలితమ్మ, జిల్లా టిడిపి పార్టీ అధికార ప్రతి దేగల కృష్ణమూర్తి, పాఠశాల ఉపాధ్యాయుల సమక్షంలో గుమ్మేపల్లి స్కూల్ విద్యా కమిటీ చైర్మన్ గా శ్రీనివాస్ ఆచారి, వైస్ చైర్మన్ గౌతమిలను ఏకగ్రీవంగా ఎంపిక చేశారు. ఈ కార్యక్రమంలో దేగల శ్రీనివాసులు, ప్రవీణ్ కుమార్, శివయ్య, బాల బ్రహ్మ ఆచారి తదితరులు పాల్గొన్నారు.

## కళ్యాణదుర్గంలో భక్తిశ్రద్ధలతో నాగుల చవితి వేడుకలు

కళ్యాణదుర్గం, ఆగస్టు 8పీపుల్స్ మోటివేషన్): కళ్యాణదుర్గం పట్టణంలోని జయ నగర్ కాలనీలో వెలసిన మద్దిలేటి స్వామి ఆలయంలో గురువారం నాగుల చవితి సందర్భంగా పట్టణ ప్రజలు పెద్ద ఎత్తున నాగుల కట్టకు పాలు పోశారు. ఉదయం నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి నాగుల కట్టకు ప్రత్యేక పూజలు నిర్వహించి పాలు పోసి పూజలు చేశారు. నాగుల చవితి పండుగ సందర్భంగా భక్తులతో ఆలయం కిటకిటలాడింది. స్వామిని దర్శించుకోవడానికి వచ్చిన భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.

తెలుగు దినపత్రిక

# పీపుల్స్ మోటివేషన్

People's Motivation

శుక్రవారం । ఆగస్టు । 9 । 2024



# పార్టీ కోసం కష్టపడ్డవారికి నామినేటెడ్ పదవులు





**త్వరలోనే సభ్యత్వ నమోదు కార్యక్రమం**

**వైసిపి ఫేక్ ప్రచారాన్ని తిప్పి కొట్టాలని నిర్ణయం**

**పోలవరం, అమరావతి నిర్మాణాలపై చర్చ**

**తెలంగాణలో పార్టీ బలోపేతంపైనా దృష్టి**

**ప్రజల భాగస్వామ్యంతో త్వరలో జన్మభూమి-2**

**టీడీపీ పొలిట్‌బ్యూరో సమవేశంలో కీలక నిర్ణయాలు**

**అమరావతి,ఆగస్ట్8(పీపుల్స్ మోటివేషన్):**

టీడీపీ పొలిట్‌బ్యూరో సమవేశంలో కీలక నిర్ణయాలు తీసుకుంది.. మంగళగిరిలోని తెలుగుదేశం పార్టీ కేంద్ర కార్యాలయంలో సీఎం, టీడీపీ అధినేత నారా చంద్రబాబు నాయుడు అధ్యక్షతన పొలిట్ బ్యూరో సమావేశమైంది. ఈ సమావేశం ముగిసిన తర్వాత మీడియాతో మాట్లాడిన ఏపీ టీడీపీ అధ్యక్షుడు పల్లా శ్రీనివాస్ రావు.. కార్యకర్తలకు నామినేటెడ్ పదవులిచ్చి వారికి సముచిత స్థానం కల్పించాలని పొలిట్‌బ్యూరో నిర్ణయించిందన్నారు.. పార్టీ కోసం పని చేసిన నేతలు.. కార్యకర్తలను ప్రభుత్వంలో భాగస్వామ్యం చేయాలని చంద్రబాబు సూచించారు. పార్టీ కోసం పని చేసినవారి జాబితా ఇప్పటికే పార్టీ వద్ద ఉంది. పార్టీ బలోపేతం కోసం పని చేసిన కార్యకర్తలకు మంచి స్థానం కల్పించే దిశగా కసరత్తు చేస్తున్నాం. సభ్యత్వ నమోదు కార్యక్రమం చేపట్టనున్నాం అన్నారు.. ఇక, పోలవరం, అమరావతి నిర్మాణాలపై చర్చ జరిగింది. ఈ రెండు ప్రాజెక్టులను గత ప్రభుత్వం విధ్వంసం చేసింది. నదుల అనుసంధానం ద్వారా రాష్ట్రానికి జరిగే మేలు గురించి చర్చించాం.. కేంద్రం అందించిన సాయంపై పొలిట్ బ్యూరో హర్షం వ్యక్తం చేసిందన్నారు. మరోవైపు.. టీడీపీ హయాంలో పెండింగులో ఉన్న నీరు-చెట్టు బిల్లుల చెల్లింపులపై చర్చించామన్నారు పల్లా శ్రీనివాస్ రావు.. వైసీపీ చేసే దుష్ప్రచారాన్ని తిప్పికొట్టే అంశం మీద మాట్లాడుకున్నామని వెల్లడించారు.. వైసీపీ ఫేక్ ప్రచారాన్ని తిప్పికొడతామని పల్లా శ్రీనివాసరావు తెలిపారు. రాజధాని, పోలవరం నిర్మాణం, నామినేటెడ్ పోస్టులు, నదుల అనుసంధానంపై చర్చించామని పల్లా శ్రీనివాసరావు వెల్లడించారు. నీరు, చెట్టు బిల్లులపై చంద్రబాబు ఆరా తీశారని చెప్పారు. ఏపీ సార్వత్రిక ఎన్నికల్లో ఘన విజయాన్ని అందించిన టీడీపీ నాయకులు, ప్రజలకు పొలిట్ బ్యూరో తరఫున ధన్యవాదాలు తెలిపారు. వైసీపీ విధ్వంసక పాలన, ఫేక్ ప్రచారంపై సమర్థవంతంగా తిప్పి కొట్టాలని నిర్ణయం తీసుకున్నామని పల్లా శ్రీనివాసరావు పేర్కొన్నారు. జనసేన అధ్యక్షుడు, ఏపీ ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ పట్టుదల ఈ రాష్ట్రానికి అవసరమని ప్రజలు ఎన్డీఏ కూటమిని గెలిపించారని మాజీ మంత్రి కాలువ శ్రీనివాసులు అన్నారు. పార్టీ నాయకులను, పార్టీని అనుసంధానం చేస్తామని వివరించారు. తొలి ఐదు సంతకాల్లో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సంక్షేమానికి అధిక ప్రాధాన్యత ఇచ్చారని తెలిపారు. ప్రజలు, రైతులు, నిరుద్యోగులకు పార్టీ అండగా ఉంటుందని హామీ ఇచ్చారు. రాష్ట్రానికి అమరావతి, పోలవరం రెండు కళ్లు అని ఉద్ఘాటించారు. నదులను అను సంధానం చేస్తే ప్రతి ఎకరాకు నీళ్లు ఇవ్వవచ్చని అన్నారు. కృష్ణా, గోదావరి జలాలను పోతిరెడ్డి పాడు ప్రాజెక్టులో ఎత్తి పోస్తే రాయలసీమ సస్యశ్యామలం అవుతుందని తెలిపారు. పేదరికాన్ని నిర్మూలించేందుకే చంద్రబాబు పీ4 ఫార్ములా తెస్తున్నారని చెప్పారు. అన్ని వర్గాలు, అన్ని ప్రాంతాల సమగ్ర అభివృద్ధే ప్రభుత్వ లక్ష్యమని చెప్పారు. పార్టీ కోసం అంకిత భావంతో పనిచేసిన వారికి నామినేటెడ్ పోస్టులు ఇస్తామని కాలువ శ్రీనివాసులు పేర్కొన్నారు.. జన్మభూమి-2 త్వరలో ప్రారంభం కాబోతోందన్నారు. జన్మభూమి-2లో ప్రజల భాగస్వామ్యం.. దాతల భాగస్వామ్యాన్ని మరింత విస్తృతం చేసేలా ఉంటుంది. నామినేటెడ్ పోస్టుల్లో వడపోత జరుగుతోంది. అర్హులైన ప్రతి ఒక్కరికీ న్యాయం చేసేలా నామినేటెడ్ పోస్టుల్లో ప్రాధాన్యం ఉంటుందన్నారు. కూటమిగా గెలుపొందాం.. నామినేటెడ్ పోస్టుల భర్తీ విషయంలోనూ అందరి ఆమోదంతో కూర్పు చేయాల్సి ఉంటుంది. పొత్తుల వల్ల టిక్కెట్లు దక్కని వారికి.. సరైన పదవులు దక్కని సీనియర్లకు నామినేటెడ్ పదవుల భర్తీ జరగనుందన్నారు. త్వరలోనే నామినేటెడ్ పదవుల భర్తీకి సంబంధించిన తొలి జాబితా విడుదల చేస్తాం. చంద్రబాబు నాయకత్వం.. పవన్ కల్యాణ్ పట్టుదల అవసరమని ప్రజలు భావించారు. ప్రజారంజక పాలన సాగిస్తూ.. పార్టీని ప్రభుత్వానికి అనుసంధానం చేసేలా ప్రణాళికలు ఏర్పాటు చేసుకుంటాం. తొలి ఐదు సంతకాలతో చంద్రబాబు ప్రజల్లో గొప్ప నమ్మకాన్ని కల్పించగలిగారని పేర్కొన్నారు. ఈ సమావేశంలో మంత్రులు, ఎమ్మెల్యేలు, టీడీపీ నేతలకు చంద్రబాబు పలు కీలక విషయాలపై దిశానిర్దేశం చేశారు. నామినేటెడ్ పదవులపై చంద్రబాబు చర్చించారు. వీలైనంత త్వరగా పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమం ప్రారంభించే ఆలోచనలో ఉన్నట్లు తెలుస్తోంది. పొలిట్ బ్యూరో సమవేశంలో తీసుకున్న కీలక నిర్ణయాలను మీడియాకు మంత్రి అచ్చెన్నాయుడు వెల్లడించారు. 'దక్షిణ భారతదేశంలో జనాభా నిష్పత్తి రోజురోజుకూ తగ్గుతుంది. జనాభా నిష్పత్తి తగ్గడంతో కేంద్రం నుంచి వచ్చే నిధులు సైతం తగ్గుతాయి. తెలంగాణలో టీడీపీ పార్టీ బలోపేతంపై దృష్టి సారించాలి. పార్టీ సభ్యత్వ రుసుం రూ.100లతో ప్రారంభిస్తాం. సభ్యత్వం తీసుకున్న వారు ప్రమాదవశాత్తు మరణిస్తే వారి కుటుంబానికి రూ.5 లక్షలు వచ్చే విధంగా పరిహారం ఇవ్వాలని నిర్ణయించారు. పేదరిక నిర్మూలనపై ప్రధానంగా చంద్రబాబు చర్చించారు. త్వరలో పేదరిక నిర్మూలనపై విధివిధానాలు రూపొందిస్తాం. విదేశాల్లో ఉన్నత స్థానాల్లో ఉన్నవారిని పేదరిక నిర్మూలన కార్యక్రమంలో భాగస్వాములుగా చేయాలని నిర్ణయం తీసుకున్నాం. ఎస్సీ వర్గీకరణకు జిల్లాను యూనిట్‌గా తీసుకుంటాం. జన్మభుమి కార్యక్రమాలు తిరిగి ప్రారంభించాలని చంద్రబాబు నిర్ణయించారు. జన్మభూమి2 గా ఈ కార్యక్రమానికి నామకరణం చేయాలని భావించారు. మొన్నటి ఏపీ సార్వత్రిక ఎన్నికల్లో సరిగ్గా దృష్టి పెడితే వైసీపీ గెలిచిన సీట్లలో మరో నాలుగు నుంచి ఐదు సీట్లు టీడీపీ గెలిచేది' అని మంత్రి అచ్చెన్నాయుడు తెలిపారు. పొలిట్ బ్యూరోలో ప్రభుత్వం అధికారం చేపట్టిన తర్వాత 55 రోజుల పాలనపై అధినేత చంద్రబాబు చర్చించారని టీడీపీ పోలిట్ బ్యూరో సభ్యులు సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి పేర్కొన్నారు. 'త్వరలో జన్మభూమి2 ప్రారంభం కాబోతుంది. జన్మభూమి -2 కార్యక్రమాన్ని విజయవంతం చేయడానికి ఎన్నారైలు, పారిశ్రామికవేత్తలు ముందుకు రావాలి. వర్షాలతో ప్రాజెక్టులన్నీ నిండుకుండలా ఉన్నాయి. ప్రాజెక్టులు నిండటంతో మాజీ సీఎం, వైసీపీ అధినేత జగన్ మోహన్ రెడ్డి గుండె నీరు కారుతోంది. నామినేటెడ్ పోస్టులను అతి త్వరలో భర్తీ చేస్తామని చంద్రబాబు హామీ ఇచ్చారు. ఇసుకలో అక్రమాలు సహించబోనని అధినేత మరోసారి హెచ్చరించారు జనాభా నియంత్రణతో డీలిమిటేషన్‌లో దక్షిణ భారతదేశానికి అన్యాయం జరుగుతోంది. ఒక యూపీలో 140 పార్లమెంటు స్థానాలు వస్తే దక్షిణ భారతదేశంలో160 మాత్రమే ఉంటాయి. జనాభా తగ్గడంతో కేంద్రం నుంచి రావాల్సిన నిధులు కూడా తగ్గిపోతాయి' అని సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి వెల్లడించారు. విశాఖ ఎమ్మెల్సీ అభ్యర్థి ఎవరనే దానిపై మంత్రులు, టీడీపీ ఎమ్మెల్యేలతో చంద్రబాబు మాట్లాడారు. ఎన్డీఏ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత టీడీపీ తొలి పొలిట్ బ్యూరో సమావేశం ఇది. ఈ భేటీకి మంత్రులు నారా లోకేష్, కొల్లు రవీంద్ర, అచ్చెన్నాయుడు, పార్టీ సీనియర్ నేతలు వర్ల రామయ్య, యనమల రామకృష్ణుడు, నిమ్మకాయల చినరాజప్ప, బొండా ఉమామహేశ్వర రావు, పల్లా శ్రీనివాసరావు, కళా వెంకట్రావు తదితరులు హాజరయ్యారు. ఈ భేటీలో చంద్రబాబు పలు కీలక నిర్ణయాలు తీసుకున్నారు.

## అమెరికాలో కొనసాగుతున్న సీఎం పర్యటన

**కాగ్నిజెంట్,చార్లెస్ స్క్వాబ్ తదితర సంస్థలకు స్వాగతం**

**బిజీ బిజీగా గడుపుతున్న రేవంత్ రెడ్డి**

**పెట్టుబడులు రాబట్టడమే లక్ష్యంగా ఒప్పందాలు**

**డల్లాస్ చేరుకున్న సిఎం రేవంత్ బృందం**

**మహాత్ముడికి ఘనంగా నివాళులు**



**హైదరాబాద్,ఆగస్ట్8(పీపుల్స్ మోటివేషన్):**

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తెలంగాణకు పెట్టుబడులు రాబట్టడమే లక్ష్యంగా అమెరికాలో వివిధ బహుళజాతి సంస్థలతో సంప్రదింపులు జరుపుతున్నారు. పరిశ్రమల స్థాపన ద్వారా ఇక్కడి యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించాలనే సంకల్పంతో ఈ నెల 3న అమెరికా వెళ్లిన సీఎం ఇప్పటి వరకు ఐదు రోజుల వ్యవధిలో 10 సంస్థలతో ఒప్పందాలు చేసుకున్నారు. ఈ క్రమంలో టెక్సాస్ చేరుకున్న సిఎం బృందం డల్లాస్‌లో మహాత్ముడి విగ్రహం వద్ద నివాళి అర్పించింది. పూలమాలు వేసిన సిఎం రేవంత్ రెడ్డి, మంత్రులు శ్రీదర్ బాబు, కోమటిరెడ్డిలు శ్రద్ధాంజలి ఘటించారు. ఇక ఒప్పందాల్లో భాగంగా కాగ్నిజెంట్ సంస్థ త్వరలో హైదరాబాద్ లో అతిపెద్ద క్యాంపస్ ను ఏర్పాటు చేసేందుకు అంగీకారం తెలిపింది. ఈ సంస్థ క్యాంపస్ ఏర్పాటు అయితే 15 వేల ఉద్యోగాలు వచ్చే అవకాశం ఉంది. వాల్ష్ కార్రా హోల్డింగ్స్ సంస్థ వీ?హబ్ లో ఐదు మిలియన్ డాలర్లను పెట్టుబడి పెట్టేందుకు అంగీకారం తెలిపింది. తెలంగాణ స్టార్టప్?లలో 100 మిలియన్ల పెట్టుబడి పెట్టనున్నట్లు పేర్కొంది. అదే విధంగా ఆర్సీసియం సంస్థతోనూ రాష్ట్ర ప్రభుత్వం ఒప్పందం చేసుకుంది. ఈ సంస్థ ద్వారా దాదాపు 500 హై? ఎండ్ టెక్ ఉద్యోగాలు లభిస్తాయి.స్వచ్ఛ్ బయో సంస్థ వెయ్యి కోట్ల పెట్టుబడులు పెట్టనున్నట్టు ప్రకటిచింది. ఈ సంస్థ ద్వారా ప్రత్యక్షంగా ఐదు వందల మందికి కొలువులు రానున్నాయి. మరో సంస్థ ట్రైజిన్ టెక్నాలజీస్ హైదరాబాద్ లో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ఇన్నోవేషన్ డెవెలప్మెంట్, డెలివరీ సెంటర్ ఏర్పాటు చేసేందుకు అంగీకారం తెలిపింది. ఈ సంస్థ ఏర్పాటు ద్వారా దాదాపు 1000 మందికి ఉద్యోగావకాశాలు వస్తాయి. హెచ్‌సీఏ హెల్త్ కేర్ నాలుగు లక్షల చదరపు అడుగుల విస్తీర్ణంలో క్యాంపస్ విస్తరించేందుకు అంగీకారం తెలిపింది. గ్లాస్ ట్యూబింగ్ ఫెసిలిటీ కేంద్రంలో వచ్చే ఏడాది వాణిజ్య ఉత్పత్తి ప్రారంభించనున్నట్టు కార్నింగ్ సంస్థ వెల్లడించింది. వీవీంట్ ఫార్మా 400 కోట్ల రూపాయల పెట్టుబడులు పెట్టనున్నట్టు తెలిపింది. ఈ సంస్థ ద్వారా వెయ్యి మందికి ఉద్యోగాలు లభించనున్నాయి. చా÷-ల్గ÷స్ స్క్వాబ్ హైదరాబాద్ లో భారతదేశంలోనే మొదటి టెక్నాలజీ డెవెలప్మెంట్ సెంటర్ ఏర్పాటు చేయనున్నట్టు ఇవాళ ప్రకటించింది. ఈ సంస్థ ఇండియాలో ఎంచుకున్న మొట్టమొదటి నగరం హైదరాబాద్ కావడం విశేషం. తెలంగాణ ప్రభుత్వం చేపడుతున్న ప్రాజెక్టుల్లో భాగస్వామ్యం అయ్యేందుకు వరల్డ్ బ్యాంకు సంసిద్ధంతను ప్రకటించింది.



# రేషన్ కేటాయింపుల్లో ఎపికి అన్యాయం

**విబజన నాటి నుంచే పొరపాట్లు జరిగాయి**

**రాష్ట్రంలో 1.47 కోట్ల కుటుంబాలకు రేషన్ సరఫరా**

**లక్ష టన్నుల కందిపప్ప ఇవ్వాలని కేంద్రాన్ని కోరాం**

**ఢిల్లీలో కేంద్రమంత్రులను కలిసిన నాదెండ్ల మనోహర్**

**న్యూఢిల్లీ,ఆగస్ట్8(పీపుల్స్ మోటివేషన్):**

ఆంధ్రప్రదేశ్‌కు లక్ష టన్నుల కందిపప్పు ఇవ్వాలని కేంద్రాన్ని కోరామని రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ తెలిపారు. దిల్లీలో కేంద్ర మంత్రిని కలిసిన అనంతరం నాదెండ్ల మీడియాతో మాట్లాడారు. రాష్ట్ర విభజన జరిగినప్పటి నుంచి రేషన్ కార్డుల విషయంలో కేంద్ర ప్రభుత్వం అనుసరించే ఎన్‌ఎఫ్‌ఎస్‌ఏ ప్రకారం ఏపీకి చాలా అన్యాయం జరిగింది. విభజన జరిగినప్పుడు జనాభా ప్రాతిపదికన కాకుండా.. 2001 సెన్సెస్ ప్రకారం కేటాయించారు. దీంతో ఏపీకి రేషన్ కార్డులు బాగా తగ్గిపోయాయి. ప్రస్తుతం రాష్ట్రంలో 1.47 కోట్ల కుటుంబాలకు ఆటంకం లేకుండా ప్రతినెలా రేషన్ సరఫరా చేస్తున్నాం. గిడ్డంగుల నిర్మాణానికి సహకారం అందించాలని, పౌరసరఫరాలశాఖకు రావాల్సిన నిధులు మంజూరు చేయాలని కేంద్రాన్ని కోరాం అని నాదెండ్ల మనోహర్ తెలిపారు. ఢిల్లీలో ఫుడ్ అండ్ పబ్లిక్ డిస్ట్రిబ్యూషన్ శాఖ మంత్రి ప్రహ్లాద్ జోషీని నాదెండ్ల మనోహర్ గురువారం నాడు కలిశారు. ఏపీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆదేశాలతో రాష్ట్ర అవసరాలను దృష్టిలో ఉంచుకుని వినతి పత్రం అందజేశారు. రాష్ట్రానికి కందిపప్పు కేటాయింపులు చేయాలని నాదెండ్ల మనోహర్ కోరారు. ఏపీలో ప్రస్తుతం ఉన్న ఎన్‌ఎఫ్‌ఎస్‌ఏ కవరేజీ కాకుండా లబ్దిదారుల కవరేజీని మరింత పెంచాలని అడిగారు. రాష్ట్రంలో మరో 8 ప్రైస్ రిపోర్టింగ్ కేంద్రాలను పెంచేందుకు అనుమతి ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. రాష్ట్రంలో ధరల స్థిరీకరణకు రూ.532 కోట్ల ధరల స్థిరీకరణ నిధులను కేటాయించాలని కోరారు. రాష్ట్రానికి రావాల్సిన రూ.1187 కోట్ల పెండింగ్ నిధులను వీలైనంత త్వరగా విడుదల చేయాలని డిమాండ్ చేశారు. దేశవ్యాప్తంగా కందిపప్పు కొరత ఎక్కువగా ఉందని చెప్పారు. ఏపీలో కిలో కందిపప్పు రూ.150లకు అందిస్తున్నామని అన్నారు. లక్ష మెట్రిక్ టన్నుల కందిపప్పు కేటాయించాలని.. కేంద్రమంత్రి ప్రహ్లాద్ జోషిని కోరామని తెలిపారు. ధాన్యం నిల్వ, గిడ్డంగుల నిర్మాణం కోసం కేంద్ర బడ్జెట్‌లో కేటాయించిన నిధుల్లో సింహభాగం ఇవ్వాలని కోరామని చెప్పారు. 1.47 లక్షల రేషన్ కార్డులకు రేషన్ అందిస్తున్నామని వివరించారు. కేంద్ర రాష్ట్ర మార్కెటింగ్ శాఖలు నిర్వహించే ప్రైస్ మనిటరింగ్ సెంటర్లను ప్రస్తుతం ఉన్న 5 నుంచి 13 పెంచాలని కోరామన్నారు. రాష్ట్రంలో 11 సీలో గోడౌన్ల నిర్మాణానికి అనుమతి మంజూరు చేయాలన్నారు. కందిపప్పు ఇతర దేశాల నుంచి కేంద్రం దిగుమతి చేసుకుంటుందని అన్నారు. నవంబర్ నాటికి కందిపప్పు సమస్య పరిష్కరిస్తామని కేంద్రమంత్రి తెలిపారని అన్నారు. కందిపప్పు సమస్య తాత్కాలికంగా వచ్చిందని..రైతులు పంట పండిస్తే ధాన్యం కొనేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని చెప్పారు. రాష్ట్రంలో త్వరలో కొత్త రేషన్ కార్డుల జారీ చేస్తామని అన్నారు. ధాన్యం కొనుగోళ్లలో రైతులకు అన్యాయం జరిగిందని చెప్పారు. రైతుల నుంచి పంట సేకరించి డబ్బు ఇవ్వలేదని అన్నారు. పెండింగ్‌లో ఉన్న రూ. 1674 కోట్లను రైతులకు చెల్లిస్తున్నామని తెలిపారు. ఇప్పటికే రూ.1000 కోట్లు ఇచ్చామన్నారు. సోమవారం మరో రూ. 674 కోట్లను చెల్లించబోతున్నామని వెల్లడించారు. డోర్ డెలివరీ రేషన్ అంటూ రూ.1800 కోట్లు గత ప్రభుత్వం వృథా చేసిందని ధ్వజమెత్తారు. డోర్ డెలివరీ రేషన్‌పై కేబినెట్‌లో చర్చించి నిర్ణయం తీసుకుంటామని అన్నారు. అర్హత ఉన్నవారికి రేషన్ కార్డులు ఇస్తాం..టా÷-గ్గ÷ట్ అంటూ ఏమి లేదని స్పష్టం చేశారు. రేషన్ బియ్యాన్ని గ్రీన్ ఛానల్ ద్వారా అక్రమ తరలింపు చేశారని మండిపడ్డారు. పార్లమెంట్ సమావేశాలు ముగిసిన తర్వాత ఒక ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించి ఈ అంశాలను పరిష్కరించే దిశగా చర్యలు తీసుకుంటామని కేంద్ర మంత్రి హామీ ఇచ్చారని నాదెండ్ల మనోహర్ తెలిపారు. అలాగే ఢిల్లీలో కేంద్ర పెట్రోలియం, సహజ వాయువుల శాఖ మంత్రి హర్దీప్ ఎస్ పూరిని మంత్రి నాదెండ్ల మనోహర్ కలిశారు. ఏపీలో ప్రస్తుతం ఉన్న 60 లక్షల దీపం కనెక్షన్లను పీఎమ్‌యూవై పథకం కింద వచ్చే విధంగా మార్పిడి చేయాల్సిందిగా విజ్ఞప్తి చేశారు. సీఎం చంద్రబాబు రాసిన లేఖను కేంద్రమంత్రికి అందజేశారు. ఈ అంశాన్ని పరిశీలించి, చర్యలు తీసుకుంటామని కేంద్రమంత్రి హామీ ఇచ్చారని మంత్రి నాదెండ్ల మనోహర్ పేర్కొన్నారు. కేంద్ర పెట్రోలియం శాఖ మంత్రి హార్దీప్ సింగ్ పూరీని కలిశానని చెప్పారు. ఉజ్వల స్కిమ్‌లో ఏపీకి నష్టం జరుగుతుందని కేంద్రమంత్రికి తెలిపానని అన్నారు. ఏపీకి విభజన వల్ల నష్టం జరిగిందని.. న్యాయం చేయాలన్న భావన కేంద్ర పెద్దల్లో కనిపిస్తుందని అన్నారు. కేంద్రమంత్రులను కలిసి రాష్ట్ర సమస్యలు తెలిపేందుకు ఎంపీలు, అధికారులు వారి సహకారాన్ని అందించారని వివరించారు. రాష్ట్ర అంశాల పరిష్కారానికి కేంద్రం సుముఖంగా ఉందని చెప్పారు.

తెలుగు దినపత్రిక
పీపుల్స్ మోటివేషన్
People's Motivation

# ఏనుగుల దాడి నుంచి కాపాడండి

మొదటి పేజీ తరువాయి



తెలుస్తోంది. చిత్తూరు జిల్లా పరిధితో పాటు ఇటు పార్వతీపురం ప్రాంతంలో ఏనుగుల సమస్య ఇబ్బందికరంగా మారింది. అవి ఊళ్ళ మీదకు వచ్చి రైతులు కష్టపడి పండించుకున్న పంటలను నాశనం చేస్తున్నాయి. ఫలితంగా ఎంతో మంది నష్టపోతుండగా.. కొంత ప్రాణహాని కూడా ఉంటోంది. ఇలా వచ్చే ఏనుగులను తిరిగి అడవిలోకి తరమడం కోసం కుంకీ ఏనుగులు అవసరం అని భావిస్తున్నారు. ఆ కుంకీ ఏనుగులు కర్ణాటక వద్ద ఉండగా.. 6 కుంకీ ఏనుగులు మన రాష్ట్రానికి ఇచ్చేలా కర్ణాటక అటవీ శాఖను పవన్ కల్యాణ్ కోరారు. ఈ విషయంపై ఆ రాష్ట్ర అటవీశాఖ మంత్రి ఈశ్వర్ బి. ఖండ్రేతో చర్చించారు. ఇంకా ఎర్రచందనం అక్రమ రవాణా విషయంలో కూడా ఇరువురు చర్చలు జరిపినట్లు తెలిసింది. స్మగ్లింగ్ నివారణకు తీసుకోవాల్సిన చర్యలపై ఖండ్రేతో పవన్ చర్చలు జరిపారు. పొరుగు రాష్ట్రాల సహకారంతో ఎర్ర చందనం దోపిడీని అరికట్టవచ్చని పవన్ తెలిపారు. ఎర్ర చందనం స్మగ్లింగ్ కట్టడి కోసం కలిసి పని చేయాలని కోరారు. ఇదే సందర్భంలో పవన్ కల్యాణ్ సంచలన వ్యాఖ్యలు చేశారు. గతంలో సినిమాల్లో హీరోలు అడవులను కాపాడేలా వ్యవహరించి హీరోయిజం చూపేవారని కానీ, ఇప్పుడు పరిస్థితి మారిందని అన్నారు. ఇప్పుడు అడవుల్లో చెట్లను నరికి స్మగ్లింగ్ చేయడం హీరోయిజం అయిందని వ్యాఖ్యానించారు. తాను సినీ రంగానికి చెందిన వాడినే అయినప్పటికీ పరిస్థితులు ఎలా మారిపోయాయో అర్థం చేసుకోవాలని అన్నారు. ఈ 40 ఏళ్లలో ఎక్కడి నుంచి ఎక్కడికి వచ్చాం అంటూ పవన్ ప్రశ్నించారు. గురువారం కర్ణాటక పర్యటనలో ఉన్న పవన్ కల్యాణ్ ఈ వ్యాఖ్యలు చేయడం హాట్ టాపిక్ అయింది. గురువారం పవన్ బెంగళూరులో కర్ణాటక అటవీశాఖ మంత్రి ఈశ్వర్ బి. ఖండ్రేతో భేటీ అయ్యారు. పవన్ కల్యాణ్ చేసిన ఈ వ్యాఖ్యలను అల్లు అర్జున్ పుష్ప సినిమాను ఉద్దేశించే చేశారని సోషల్ మీడియాలో చర్చ జరుగుతోంది. పుష్ప సినిమా పూర్తిగా ఎర్రచందనం స్మగ్లింగ్ చుట్టే తిరుగుతుంది. అందులో హీరో అయిన అల్లు అర్జున స్మగ్లింగ్ చేస్తూ హీరోయిజం ప్రదర్శిస్తుంటాడు దీంతో అల్లు అర్జున్ ను టార్గెట్ చేసి పవన్ ఈ వ్యాఖ్యలు చేసినట్లు భావిస్తున్నారు. పైగా అల్లు అర్జున్ కు మెగా కుటుంబంతో బేధాభిప్రాయాలు ఉన్నట్లుగా ప్రచారం ఉంది. గత ఎన్నికల సమయంలో అల్లు అర్జున పవన్ కల్యాణ్ కోసం పిఠాపురానికి ప్రచారానికి రాకుండా.. ప్రత్యర్థి పార్టీ అభ్యర్థి కోసం ప్రచారానికి నంద్యాల వెళ్లిన సంగతి తెలిసిందే. ఆ పరిణామం కూడా అప్పట్లో సంచలనం అయింది. ఇలాంటి పరిస్థితుల్లో తాజాగా పవన్ కల్యాణ్ అల్లు అర్జున్ ను ఉద్దేశించే పరోక్షంగా ఈ వ్యాఖ్యలు చేశారని అంతా అనుకుంటున్నారు. అయితే పవన్ వ్యాఖ్యలు సంచలనంగా మారడంతో ఢిల్లీలో ఉన్న మంత్రి నాదెండ్ల మనోహర్ స్పందించారు. పవన్ ఎవరినీ ఉద్దేశించి వ్యాఖ్యలు చేయరని అన్నారు. పవన్ కళ్యాణ్ వ్యక్తిగతంగా ఎవరిని విమర్శించరు. పర్యావరణాన్ని కాపాడాలి, మొక్కలు పెంచాలనే ప్రత్యేక కార్యాచరణతోనే అటవీ పర్యావరణ శాఖ మంత్రిగా పవన్ కళ్యాణ్ చర్యలు తీసుకుంటున్నారఅని మంత్రి నాదెండ్ల మనోహర్ పేర్కొన్నారు. పవన్ చేసిన వ్యాఖ్యలు సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి. మెగా కుటుంబానికి చెందిన ఓ నటుడి గురించి ఆయన ఈ వ్యాఖ్యలు చేశారని నెటిజన్లు కామెంట్స్ చేస్తున్నారు.

# మేడిగడ్డ,సుంకిశాల పాపం బిఆర్‌ఎస్‌దే

**లోపభూయిష్టంగా ప్రాజెక్టుల నిర్మాణం**
**విద్యుత్ ఉన్నతాధికారులతో భట్టి సమీక్ష**
**నాణ్యమైన విద్యుత్ సరఫరా చేయాలని ఆదేశం**

**హైదరాబాద్,ఆగస్ట్8(పీపుల్స్ మోటివేషన్):**

మేడిగడ్డ ప్రాజెక్టుతోపాటు సుంకిశాల పాపం కూడా గత భారాస పాలకులదే నని తెలంగాణ ఉపముఖ్యమంత్రి భట్టివిక్రమార్క ఆరోపించారు. ఆ నెపం వేరొకరి మీద వేయడం దారుణమని విమర్శించారు. నాసికరమైన కట్టడం, డిజైన్ లోపం కారణంగానే 2021లో భారాస హయాంలో చేపట్టిన సుంకిశాల రిటైనింగ్ వాల్ కూలిందన్నారు. భారాస కాలం నాటి ప్రాజెక్టు డిజైన్లు లోపభూయిష్టంగా ఉన్నాయని ఆరోపించారు. కూలిపోయే గోడలు కట్టి.. మరొకరిపై బురద జల్లే ప్రయత్నం చేస్తున్నారన్నారు. వర్షాల దృష్ట్యా చేపట్టాల్సిన చర్యలపై హైదరాబాద్‌లోని టీజీఎస్పీడీసీఎల్ ప్రధాన కార్యాలయంలో విద్యుత్‌శాఖ ఉన్నతాధికారులతో భట్టి సమీక్షించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సుంకిశాలపై వార్తల్లో తప్పుడు ప్రచారం జరుగుతోందని చెప్పారు. మేడిగడ్డ గోదావరి నదిపై మాత్రమే కాదని, కృష్ణానదిని కూడా బీఆర్ఎస్ ప్రభుత్వం వదిలిపెట్టలేదని చెప్పారు. సుంకిశాలను బీఆర్ఎస్ నిర్మించిందని చెప్పారు. డిజైన్ లోపం వల్ల సుంకిశాల కూలిందని...దీన్ని కాంగ్రెస్ ప్రభుత్వంపై రుద్దే ప్రయత్నం చేస్తున్నారని ధ్వజమెత్తారు. సుంకిశాల కట్టింది తాము కాదని గత ప్రభుత్వం కట్టిందేనని స్పష్టం చేశారు. గోదావరి మేడిగడ్డతో పాటు సుంకిశాల పాపం కేసీఆర్ ప్రభుత్వానిదేనని తేల్చిచెప్పారు. 2021లో మొదలు 2023 జూలైలో సుంకిశాలను బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రారంభించిందని తెలిపారు. కేసీఆర్ ప్రభుత్వ పాపాలను తమపై రుద్దే ప్రయత్నం చేస్తున్నారని ÷ర్ అయ్యారు. పాపాలను భరించలేక ఇప్పటికే ప్రజలు కేసీఆర్ ప్రభుత్వానికి బుద్ధి చెప్పారని మల్లు భట్టి విక్రమార్క పేర్కొన్నారు. పదోన్నతులపై ఉద్యోగులతో చర్చిస్తామని తెలిపారు. జీహెచ్ఎంసీ పరిధిలో ప్రజలకు నాణ్యమైన విద్యుత్ సరఫరా చేయాలని ఎస్పీడీసీఎల్ అధికారులకు భట్టి విక్రమార్క అదేశించారు. వర్షాకాలం సీజన్‌ను దృష్టిలో పెట్టుకుని అధికారులను అప్రమత్తం చేశామని తెలిపారు. ఈ సమావేశంలో పలు కీలక అంశాలపై చర్చించారు. వర్షాల నేపథ్యంలో తీసుకోవాల్సిన చర్యలపై సంబంధింత అధికారులకు కీలక ఆదేశాలు జారీ చేశారు. అంతర్జాతీయ పెట్టుబడులను దృష్టిలో పెట్టుకుని విద్యుత్ సరఫరాపై దిశానిర్దేశం చేశారు. ఎస్పీడీసీఎల్‌లో అంతర్గత బదిలీలు, ప్రమోషన్లపై కూడా ఆదేశాలు జారీ చేశామని అన్నారు. విద్యుత్ సరఫరాకు ఏదైనా ఇబ్బంది అయితే 1912 టోల్ ఫ్రీ నెంబర్‌కు ఫిర్యాదు చేయాలని సూచించారు. ప్రజల కోసమే నిరంతరం ఎస్పీడీసీఎల్ పనిచేస్తోందని మర్చిపోవద్దని అన్నారు.

# ప్రకాశం బ్యారేజీకి కొనసాగుతున్న వరద

**40 గేట్లు ఎత్తి దిగువకు నీటి విడుదల**
**పులిచింతల 11 గేట్లు ఎత్తడంతో భారీగా వరద**

**విజయవాడ,ఆగస్ట్8(పీపుల్స్ మోటివేషన్) :**

విజయవాడలోని ప్రకాశం బ్యారేజీకి వరద నీటి ప్రవాహం అంతకంతకూ పెరుగుతోంది. శ్రీశైలం, నాగార్జునసాగర్, పులిచింతల ప్రాజెక్ట్ గేట్లను ఎత్తివేయడంతో ప్రకాశం బ్యారేజీలోకి వరద నీరు భారీగా వచ్చి చేరుతోంది. వరద నీరు అధికంగా ఉండటంతో బ్యారేజీ 40 గేట్లు ఆరు అడుగుల మేర,30 గేట్లు ఏడు అడుగుల మేరఎత్తి 2,74,200 క్యూసెక్కుల నీటిని సముద్రంలోకి విడుదల చేస్తున్నారు. ప్రకాశం బ్యారేజీ గేట్లు ఎత్తిన నేపథ్యంలో అధికారులు అప్రమత్తమయ్యారు. దిగువ ప్రాంతాల ప్రజలు జాగ్రత్తగా ఉండాలంటూ హెచ్చరికలు జారీ చేశారు. ప్రస్తుతం బ్యారేజీ 2,88,191 క్యూసెక్కులుగా ఉంది. కాలువలకు 13,991 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. చింతలపూడి మండలం నాగిరెడ్డిగూడెం తమ్మిలేరు రిజర్వాయర్ లో వరద నీరు భారీగా వచ్చి చేరుతోంది. ఇన్ ఎ÷-లో 5256 క్యూసెక్కులు,అవుట్ ఎ÷-లో 5688 క్యూసెక్కులుగా ఉంది. పూర్తిస్థాయి నీటిమట్టం 355 అడుగులు కాగా.. ప్రస్తుత నీటిమట్టం 349.49 అడుగులకు చేరింది. ఏలూరు జిల్లా జంగారెడ్డిగూడెం కొంగువారిగూడెం ఎర్రకాల్వ జలాశయానికి వరద ప్రవాహం పెరుగుతోంది. రిజర్వాయర్ పూర్తి స్థాయి నీటిమట్టం 83.50 మీటర్లు కాగా, ప్రస్తుతం 82.30 మీటర్ల నీటిమట్టం చేరుకుంది. ప్రాజెక్ట్‌లోకి ప్రస్తుతం ఆరువేల క్యూసెక్కుల నీరు వచ్చి చేరుతోంది. దీంతో అధికారులు ప్రాజెక్ట్ నాలుగు గేట్లు ద్వారా 6500 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. ఇకపోతే పల్నాడు జిల్లాలో పులిచింతల ప్రాజెక్టుకు నాగార్జున సాగర్ నుంచి వరద ప్రవాహం కొనసాగుతోంది. దీంతో 11 గేట్లు ఎత్తి 2.30 లక్షల క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. పులిచింతలకు ఎగువ నుంచి 2.45 లక్షల క్యూసెక్కుల వరద ప్రవాహం వచ్చి చేరుతోంది. విద్యుదుత్పత్తి కోసం 15 వేల క్యూసెక్కుల నీటిని మళ్లిస్తున్నారు. మిగతా నీటిని గేట్లు ఎత్తి ప్రకాశం బ్యారేజికి పంపిస్తున్నారు. పులిచింతల జలాశయం పూర్తి నీటి నిల్వ సామర్థ్యం 45.77 టీఎంసీలు కాగా.. ప్రస్తుత నీటి నిల్వ 31.89 టీఎంసీలుగా నమోదైంది. వరద వస్తుండటంతో అధికారులు నీటిమట్టాల్ని అలాగే కొనసాగిస్తూ వచ్చిన వరద నీటిని వచ్చినట్లు దిగువకు పంపిస్తున్నారు. వరద తగ్గుముఖం పట్టాక ప్రాజెక్టును పూర్తిస్థాయిలో నింపనున్నట్లు అధికారులు తెలిపారు.



# బిఆర్‌ఎస్ విలీనం అంటూ పనిగట్టుకుని కుట్రలు

**దుష్ప్రచారాలతో పార్టీని దెబ్బతీయలేరు**
**తాత్కాలికంగా వచ్చిన నష్టం ఎల్లకాలం ఉండది**
**మాజీమంత్రి శ్రీనివాస గౌడ్ వెల్లడి**



**న్యూఢిల్లీ,ఆగస్ట్8(పీపుల్స్ మోటివేషన్):**

బీఆర్ఎస్‌పై కొంతమంది కుట్రలు చేస్తున్నారని మాజీ మంత్రి శ్రీనివాస్ గౌడ్ సంచలన ఆరోపణలు చేశారు. కొంతమంది పార్టీ పని అయిపోయిందని దుష్ప్రచారం చేశారని మండిపడ్డారు. రాష్ట్రం ఏర్పడ్డ తర్వాత కూడా కొందరికి పాత బుద్ధి మారలేదని విమర్శించారు. ఇప్పుడు బీజేపీలో విలీనం అంటూ అత్యుత్సాహంతో కథనాలు రాస్తున్నారని ధ్వజమెత్తారు. టీఆర్ఎస్ ఆవిర్భావం నుంచి పార్టీపై కుట్రలు జరిగాయన్నారు. టీఆర్ఎస్ పార్టీ పుట్టిందే తెలంగాణ కోసం. భూమి ఉన్నంత వరకు తమ పార్టీ ఉంటుందని స్పష్టం చేశారు. ప్రభుత్వంలో ఉంటే రాష్ట్రాన్ని అభివృద్ధి చేస్తుందని.. ప్రతిపక్షంలో ఉంటే ప్రశ్నిస్తుంది.. ప్రజల పక్షాన కొట్లాడుతుందని ఉద్ఘాటించారు. గురువారం నాడు ఢిల్లీ వేదికగా శ్రీనివాస్ గౌడ్ మీడియాతో మాట్లాడుతూ... బీఆర్ఎస్ బలహీనపడలేదు. తాము బలంగానే ఉన్నామని అన్నారు. ప్రజలు 39 సీట్లు ఇవ్వడం అంటే బలహీనమైనట్టు కాదని చెప్పారు. నిన్నగాక మొన్న మహబూబ్‌నగర్‌లో స్థానిక సంస్థల కోటా ఎమ్మెల్సీని తాము గెలుచుకున్నామని గుర్తుచేశారు. ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం రాక ముందు రాష్ట్ర పరిస్థితి, ఏర్పడ్డ తర్వాత పరిస్థితిని పోల్చి చూడాలని సూచించారు. వ్యవసాయం, విద్యుత్, ఆర్థిక స్థితిగతులు, తెలంగాణ అస్తిత్వం ఎలా ఉండేదో గుర్తుకు తెచ్చుకోవాలని అన్నారు. తెలంగాణ పేరు ఉచ్చరించడానికి కూడా కొంతమంది భయపడేవారని అన్నారు. సచివాలయంలో భాష (యాస) మార్చుకుని మాట్లాడిన సందర్భాలు ఉన్నాయని చెప్పారు. తెలంగాణ పేరు చెబితే గతంలో ఢిల్లీ ఏపీ భవన్‌లో గదులు కూడా ఇవ్వకపోయేవారని గుర్తుచేశారు. ఢిల్లీకి వస్తే పార్టీని విలీనం చేసినట్టా..? ఢిల్లీకి మేం రాకూడదా..? అని ప్రశ్నించారు. ఎమ్మెల్యేల అనర్హత అంశంపై సుప్రీంకోర్టులో పోరాటం కోసం ఢిల్లీకి వచ్చామని వెల్లడించారు. కోడి గుడ్డుపై ఈకలు పీకినట్టు నోటికొచ్చింది ప్రసారం చేయడం తగదని అన్నారు. ఊహాజనితంగా కథనాలు రాయడం జర్నలిజానికి మంచిది కాదని వార్నింగ్ ఇచ్చారు. ఇలాంటి కథనాలు రాస్తున్నది, ప్రసారం చేస్తున్నది ఎవరో కూడా అందరికీ తెలుసునని అన్నారు. ఇద్దరు ఎంపీలతో బీజేపీ ప్రస్థానం మొదలైందని.. అలాగని ఆ పార్టీ అక్కడితో ఆగిపోయిందా? అని నిలదీశారు. ఇప్పుడు బీఆర్ఎస్ కూడా అంతే. కొందరు డబ్బులకు ఆశపడి కాంగ్రెస్ పార్టీలోకి వెళ్లారని. అంతమాత్రాన బీఆర్ఎస్ పార్టీ పని అయిపోయినట్టు కాదని తేల్చిచెప్పారు. ప్రజలు కూడా రైతు బంధు సహా చాలా పథకాలు ఎక్కువ ఇస్తామని చెబితేనే నమ్మి కాంగ్రెస్ పార్టీకి ఓటు వేశారని అన్నారు. ఏ పార్టీ శాశ్వతంగా అధికారంలో ఉండదని. కొన్నేళ్ల తర్వాత ప్రజలు మార్పు కోరుకుంటారని స్పష్టం చేశారు. ఒక జాతీయ పార్టీగా ఎదగాలని కోరుకోవడం తప్పేం కాదు కదా..? అని ప్రశ్నించారు. ఆ జాతీయ పార్టీ పక్క రాష్ట్రంలో ఏం చేసిందో ప్రజలు చూశారని అన్నారు. మొన్నటి లోక్‌సభ ఎన్నికల్లో ప్రధానిగా మోదీయా.. రాహుల్ గాంధీయా అన్నదే చూశారని... అందుకే ప్రాంతీయ పార్టీలకు అవకాశం దక్కలేదని చెప్పారు. తాము అటో ఇటో ఉంటే బీఆర్ఎస్‌కు కూడా 10-15 సీట్లు వచ్చి ఉండేవని జోస్యం చెప్పారు. తాము ఈ రెండు కూటముల్లో లేకపోవడంతోనే ఫలితాలు ఇలా వచ్చాయని అన్నారు. ఎన్నికలప్పుడు లేని ఆలోచన ఇప్పుడు ఉండదని.. ఏ కూటమిలో చేరే ఆలోచన బీఆర్ఎస్ పార్టీకి లేదని తేల్చిచెప్పారు. ఇక విలీనం అన్న ప్రస్తావన అస్సలే లేదని... అది పూర్తిగా దుష్ప్రచారం మాత్రమేనని అన్నారు. ప్రజాగ్రహం ఎదురైతే బంగ్లాదేశ్‌లో ఏం జరిగిందో చూశాం. ఎక్కడైనా అలాగే జరుగుతుందని శ్రీనివాస్ గౌడ్ హెచ్చరించారు.


# తెలంగాణకు పెట్టుబడులపై విషప్రచారం

**ఓడిన నైరాశ్యంలో బిఆర్ఎస్ నేతల విమర్శలు**
**సిఎం రేవంత్ టూర్‌పై దుష్ప్రచారం తగదు**
**మండిపడ్డ కాంగ్రెస్ నేత సంపత్**

**హైదరాబాద్,ఆగస్ట్8(పీపుల్స్ మోటివేషన్):**

సీఎం రేవంత్ రెడ్డి అమెరికా పర్యటనపై బీఆర్ఎస్ నేతలు బాల్క సుమన్, క్రిశాంక్ చేసిన వ్యాఖ్యలను ఏఐసీసీ కార్యదర్శి సంపత్ కుమార్ తిప్పి కొట్టారు. గురువారం మీడియాతో మాట్లాడుతూ... 'బాల్క సుమన్, క్రిశాంక్‌లు కేటీఆర్‌కు విరుద్ధంగా మాట్లాడుతున్నారు. కేటీఆర్‌కు సుమన్, క్రిశాంక్ మధ్య చెడినట్లుంది' అంటూ వ్యాఖ్యలు చేశారు. సీఎం రేవంత్ రెడ్డి అమెరికా పర్యటన విజయవంతం కావాలని కేటీఆర్ కోరుకున్నారని తెలిపారు. ఓడిపోయిన నైరాశ్యంలో బీఆర్ఎస్ నేతలు ఏం మాట్లాడుతున్నారో అర్థం కావట్లేదని మండిపడ్డారు. తెలంగాణలో నిరుద్యోగులకు ఉద్యోగ కల్పన కోసం సీఎం రేవంత్ రెడ్డి, మంత్రి శ్రీధర్ బాబు కృషి చేస్తున్నారన్నారు. పెట్టుబడుల కోసమే సీఎం, మంత్రులు అమెరికా వెళ్లారన్నారు. ఓర్వలేక సీఎం రేవంత్ రెడ్డిపై ఆయన కుటుంబంపై కొందరు విషం కక్కుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. కొడంగల్లో రేవంత్ రెడ్డి రివ్యూ మీటింగ్ జరిగేటప్పుడు కాంగ్రెస్ ఇంచార్జ్‌గా తిరుపతి రెడ్డి అధ్యక్షత వహించారని తెలిపారు. కొండల్ రెడ్డి ఆస్ట్రేలియా టూర్ అధికారిక పర్యటన కాదని స్పష్టం చేశారు. ఇంకో సోదరుడుకి అమెరికాలో స్వచ్ బయో కంపెనీ ఉందని... దానిద్వారా తెలంగాణలో పెట్టుబడులు పెడితే తప్పేంటి? దాని మీద ఎందుకు రాజకీయం చేస్తున్నారు అని నిలదీశారు. పది సంవత్సరాలలో కేసీఆర్ కుటుంబం మొత్తం తెలంగాణలో విస్తరించారన్నారు. రేవంత్ రెడ్డి ఎనిమిది నెలలలో కుటుంబాన్ని ఎక్కడ చూపించలేదని తెలిపారు. శ్రీరాముడి కల్యాణానికి భద్రాచలం ఆయన మనుమడు తలంబ్రాలు తీసుకెళ్లిండు. కుటుంబ పాలన అంటే కేసీఆర్ ది. రేవంత్ రెడ్డిది కాదు. కావాలనే బట్ట కాల్చి మీద ఏస్తున్నారు. ప్రాంతం వారు మోసం చేస్తే అక్కడే బొంద పెట్టాలి, ప్రాంతీయేతరులు మోసం చేస్తే బయట బొంద పెట్టాలని కాళోజీ నారాయణ రావు చెప్పారు. అందుకే పది ఏండ్లు తెలంగాణను మోసం చేసిన కేసీఆర్‌ను ప్రజలు బొంద పెట్టారు. మరొకసారి బద్నాం చేయాలని చూస్తే మెమేంటో చూపిస్తాం' అంటూ సంపత్ కుమార్ హెచ్చరించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్ తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. సీఎం రేవంత్ తన సోదరులను తెలంగాణ మీదకు వదిలేశారని.. అతని సోదరులకు ఏ పదవులు లేకున్నా రాజ్యాంగేతర శక్తులుగా వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు. సాక్షాత్తూ అసెంబ్లీ కమిటీ హాల్‌లో రేవంత్ సోదరుడు తిరుపతి రెడ్డి ఏ హోదా లేకున్నా స్పీకర్ దగ్గర వికారాబాద్ రివ్యూ మీటింగ్‌లో పాల్గొన్నారని తెలిపారు. కొడంగల్‌లో తిరుపతి రెడ్డి కల్యాణ లక్ష్మి చెక్కులను పంచుతుంటే తమ జెడ్పిటీస్ మహిపాల్ అడ్డుకున్నారని తెలిపారు. రేవంత్ మరో సోదరుడు కొండల్ రెడ్డికి ఏ హోదా ఉందని అధికారులతో కలిసి ఆస్ట్రేలియా పర్యటనలో ఉన్నారని ప్రశ్నించారు. రేవంత్ అమెరికా పర్యటనలో స్వచ్ బయోతో రాష్ట్ర ప్రభుత్వం వెయ్యి కోట్ల ఒప్పందం కుదుర్చుకుందని... ఆ కంపెనీ రేవంత్ మరో సోదరుడు ఎనుముల జగదీశ్ రెడ్డిది అని తెలిపారు. పదిహేను రోజుల క్రితమే ఆ కంపెనీ ఏర్పాటయ్యిందని అన్నారు. ఇవే కాకుండా రేవంత్ సోదరుల ఆధ్వర్యంలో నాలుగు సంస్థలు ఏర్పాటు అయ్యాయన్నారు. ఈ సంస్థల ద్వారానే రేవంత్ బ్లాక్ మనీని వైట్‌గా మారుస్తున్నారని విమర్శలు గుప్పించారు. ప్రధాన కంపెనిలే కాకుండా రేవంత్ సోదరులు అనేక మైక్రో సంస్థల్లో డైరెక్టర్లుగా ఉన్నారన్నారు. రేవంత్ సోదరులు రియల్టర్లను బెదిరించి విచ్చల విడిగా అవినీతికి పాల్పడుతున్నారని మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్ వ్యాఖ్యలు చేశారు.

# వినేష్ ఫోగట్‌కి మద్దతుగా అమెరికా దిగ్గజం



పారిస్ లో జరుగుతున్న విశ్వ క్రీడలు ఒలంపిక్స్ లో భారత కల చెదిరిపోయింది. ఈసారి తప్పకుండా భారత్కు స్వర్ణ వరిస్తుంది అనుకుంటే చివరికి అందరూ నిరాశలో మునిగిపోయే ఒక ఘటన జరిగింది. సెమీఫైనల్ మ్యాచ్లో ఏకంగా ప్రపంచ నెంబర్ వన్ అలవోకగా ఓడించి.. ఫైనల్ కు చేరిన భారత రెజ్లింగ్ క్రీడాకారిణి వినేష్ పోగాట్ కి ఊహించని షాక్ తగిలింది. ఫైనల్ చేరిన ఆమె తప్పకుండా స్వర్ణ గెలుస్తుంది అని అందరూ ఆశలు పెట్టుకోగా. ఇక ఆమెపై అధిక బరువు కారణంగా అనర్హత వేటు వేసింది ఒలంపిక్స్ కమిటీ. ఇలా అద్భుతమైన పోరాట ప్రతిభకు కేరాఫ్ అడ్రస్ గా నిలిచిన వినేష్ కి ప్రస్తుతం అంతర్జాతీయంగా మద్దతు లభిస్తుంది. అయితే ఫైనల్ కు అర్హత సాధించిన వినేష్ కి కనీసం రజక పథకమైన ఇవ్వాలి అన్న డిమాండ్ వ్యక్తం అవుతుంది. ఆమెకు సిల్వర్ మెడల్ ఇవ్వాలని అమెరికా రెజ్లింగ్ దిగ్గజం జోర్డాన్ భరోజ్ డిమాండ్ చేశారు. ఆరు సారు వరల్డ్ ఛాంపియన్, 2012 లండన్ ఒలంపిక్స్ గోల్డ్ మెడలిస్ట్ అయినా జోర్డాన్ భరోజ్ సోషల్ మీడియా వేదికగా స్పందిస్తూ వినీష్ కు మద్దతు ప్రకటించాడు. ఇలాంటి ఘటనలతో ఐఓసీ మేల్కోవాలి. రెజ్లింగ్కు ఆరు కంటే ఎక్కువ కేటగిరీలు అవసరం. వినేష్ ముగ్గురు ప్రపంచ స్థాయి అట్లెట్లతో కఠిన మ్యాచ్లు ఆడింది. గోల్డ్ మెడల్ మ్యాచ్ కోసం రాత్రంతా కష్టపడింది. ఏ అథ్లెట్ అలా కష్టపడదు. ఫైనల్ కోసం వినేష్ అర్హత పొందేందుకు భారత బృందం చివరి వరకు ప్రయత్నించింది. కానీ ఇది వాళ్లకు నిరాశ. అయితే ఉదయం 8:30 నుంచి 10:30 మధ్య బరువు కొలవద్దని.. ఇక రెండో రోజు రెజ్లర్ల బరువులో ఒక కిలో వరకు మినహాయింపు ఇవ్వాలని నిబంధనలో మార్పులు చేయాలంటూ సూచించాడు ఈ దిగ్గజ రెజ్లింగ్. చివరగా వినేష్ పొగాట్ కి సిల్వర్ మెడల్ ఇవ్వాలి అంటూ రాసుకోచ్చాడు.

## టీమిండియా ఘోర ఓటమికి.. మూడు ప్రధాన కారణాలు ఇవే?



ఈ మధ్యకాలంలో ఫార్మట్ తో సంబంధం లేకుండా టీం ఇండియా ఎంత అత్యుత్తమమైన ప్రదర్శన చేస్తూ ఉందో ప్రత్యేకంగా చెప్పాల్సిన పనిలేదు. ప్రత్యర్థి ఎవరైనా సరే లెక్కచేయకుండా పూర్తిస్థాయి ఆదిపత్యాన్ని చాలాయిస్తుంది. అలాంటి టీమిండియా ఇక శ్రీలంక పర్యటనలో భాగంగా జరిగిన వన్డే సిరీస్ లో మాత్రం చెత్త ప్రదర్శన చేసింది. ఇక ఈ మధ్యకాలంలో టీమిండియా చేసిన అత్యంత చెత్త ప్రదర్శన ఇదే కావడం గమనార్హం. కనీసం ఒక్క మ్యాచ్లో కూడా గెలవకుండా మూడు మ్యాచ్ ల వన్డే సిరీస్ ను కోల్పోయింది టీమిండియా. అయితే గెలిచే మ్యాచ్లలో కూడా ఓడిపోయి చివరికి తీవ్ర స్థాయిలో విమర్శలు ఎదుర్కొంటుంది అన్న విషయం తెలిసిందే. మరి ముఖ్యంగా చివరి వన్డే మ్యాచ్లో అటు భారత జట్టు ఎక్కడ శ్రీలంకకు పోటీ ఇవ్వలేక 110 పరుగుల తేడాతో దారుణ ఓటమిని చవిచూడటం అటు భారత అభిమానులను మరింత నిరాశకు గురిచేసింది. ఈ ఓటమిని అస్సలు జీర్ణించుకోలేకపోతున్నారు అని చెప్పాలి. ఈ క్రమంలోనే టీమ్ ఇండియా ఓటమికి గల మూడు ప్రధాన కారణాలు ఇవే అంటూ ఒక వార్త వైరల్ గా మారిపోయింది. బ్యాటింగ్ వైఫల్యం : భారత జట్టులో ఎన్నడు లేనంతగా బ్యాటింగ్ వైఫల్యం కొనసాగింది. ఏ ఒక్కరు కూడా చెప్పుకోదగ్గ ప్రదర్శన చేయలేదు. కెప్టెన్ హిట్ మ్యాన్ 20 బంతుల 35 పరుగులు తప్ప మిగతా వాళ్ళందరూ కూడా సింగిల్ డిజిట్ స్కోర్ కే పరిమితం అయ్యారు. ఆఖరిలో వాషింగ్టన్ సుందర్ పోరాడిన చివరికి ఉపయోగం లేకుండా పోయింది. సిరాజ్ : సిరాజ్ రూపంలో ఒకే స్పెషలిస్ట్ ఫేసర్ తో బలిలోకి దిగింది భారత జట్టు. అతను మాత్రం 9 ఓవర్లు వేసి 78 పరుగులు సమర్పించుకున్నాడు. దీంతో జట్టులో క్వాలిటీ ఫేసర్ లేకపోవడమే జట్టు ఓటమిని శాసించింది అని చెప్పాలి. విరాట్ కోహ్లీ : ఈ సిరీస్ మొత్తం విరాట్ కోహ్లీ దారుణంగా విఫలమయ్యాడు. తొలి రెండు మ్యాచ్ లలో దారుణంగా విఫలమైన.. ఇక మూడో వన్డేలో 20 పరుగులు చేసి లయ అందుకున్నట్లు కనిపించాడు. కానీ అంతలోనే చివరికి వికెట్ కోల్పోయాడు. కోహ్లీ లాంటి సీనియర్ ప్లేయర్ నిలకడగా ఆడాల్సింది పోయి విఫలం కావడంతో మిగతా ఆటగాళ్లకు ఆత్మవిశ్వాసం దెబ్బతిని త్వర త్వరగా అవుట్ అయ్యారు. ఇక ఈ మూడే అటు భారత ఓటమికి కారణమని చెప్పాలి.

## రోహిత్ అరుదైనా రికార్డ్ కొట్టాడుగా?



ప్రస్తుతం భారత జట్టు శ్రీలంక పర్యటనలో ఉంది. ఈ క్రమంలోనే ఈ పర్యటనలో మూడు ఫార్మాట్లలో కూడా సిరీస్ లో ఆడుతుంది. కాగా ఇప్పటికే సూర్య కుమార్ యాదవ్ కెప్టెన్సీ లో ఆడిన టి20 సిరీస్ తో పాటు రోహిత్ కెప్టెన్సీలో వన్డే సిరీస్ ను కూడా ముగించుకుంది భారత జట్టు. అయితే టి20 ఫార్మాట్లో 3-0 తేడాతో సిరీస్లో గెలుచుకున్న భారత జట్టు వన్డే సిరీస్ లో మాత్రం తీవ్రంగా నిరాశపరిచింది అని చెప్పాలి. గెలవాల్సిన మ్యాచ్లలో సైతం ఓడిపోయి తీవ్ర స్థాయిలో విమర్శలు ఎదుర్కొంటుంది. మొదటి మ్యాచ్ లో గెలవాల్సిన పరిస్థితుల్లో కూడా టీమిండియా మ్యాచ్ టైగా ముగించింది. ఇక ఆ తర్వాత రెండు మూడు మ్యాచ్ లలో కూడా ఓడిపోయింది భారత జట్టు. దీంతో శ్రీలంక జట్టు సిరీస్ ను కైవసం చేసుకోగలిగింది అని చెప్పాలి. అయితే భారత జట్టు ఏకంగా మూడో వన్డే మ్యాచ్లో భారీ తేడాతో ఘోర ఓటమిని చవిచూడటం అటు అభిమానులు అందరిని కూడా షాక్ కు గురిచేసింది అని చెప్పాలి. దాదాపు 27 ఏళ్ల తర్వాత భారత జట్టు ఇలా శ్రీలంక జట్టుపై వన్డే సిరీస్ ఓడిపోవడంతో ఈ ఓటమిని అటు భారత జట్టు అభిమానులు అస్సలు జీర్ణించుకోలేకపోతున్నారు అని చెప్పాలి. అయితే ఇలా భారత జట్టు ఓడిపోయినప్పటికీ కెప్టెన్ రోహిత్ శర్మ మాత్రం ఒక అరుదైన రికార్డును ఖాతాలో వేసుకున్నాడు. 20 బంతుల్లోనే ఏకంగా 36 పరుగులు చేసి ఆకట్టుకున్నాడు. 175 స్ట్రైక్ రేట్ తో బ్యాటింగ్ చేసిన టీమిండియా కెప్టెన్ రోహిత్ శర్మ క్రీజ్ లో ఉన్నంత సేపు లంక బౌలర్లను ఒక ఆట ఆడుకున్నాడు. వరుస ఫోర్ లతో స్కోరు బోర్డుని పరుగులు పెట్టించాడు. ఒక అరుదైన రికార్డును నమోదు చేశాడు.

## మా ఓటమికి అది కారణం కాదు



గత కొంతకాలం నుంచి విదేశీ పర్యటనకు వెళ్లిన లేదంటే స్వదేశంలో మ్యాచ్లు ఆడిన ప్రత్యర్థులపై పూర్తి ఆదిపత్యం చెలాయిస్తూ వస్తుంది టీమిండియా. ఈ క్రమంలోనే అద్భుతమైన ఆట తీరుతో ఆకట్టుకుంటుంది. వరుసగా సిరీస్ లు గెలుస్తూ అదరగొట్టేస్తోంది. అలాంటి టీం ఇండియా ఇటీవల శ్రీలంక పర్యటనలో భాగంగా ఆ జట్టుతో జరిగిన వన్డే సిరీస్ లో మాత్రం చెత్త ప్రదర్శన చేసింది. చివరికి ఒక్క గెలుపు కూడా లేకుండానే సిరీస్ ను చేజార్చుకుంది అన్న విషయం తెలిసిందే. దాదాపు 27 ఏళ్ల నుంచి అటు శ్రీలంకపై వన్డే ఫార్మాట్లో పూర్తిస్థాయి ఆదిపత్యం చెలయిస్తూ వస్తుంది టీమిండియా. ఒక్క సిరీస్ కూడా ఓడిపోలేదు అని చెప్పాలి. అలాంటిది రోహిత్ శర్మ సారధ్యంలో ఇటీవల వన్డే సిరీస్ లో ఓడిపోయింది భారత జట్టు. అది కూడా ఆఖరి మ్యాచ్లో 110 పరుగుల భారీ తేడాతో ఓటమిపాలు కావడం భారత అభిమానులను మరింత నిరాశకు గురిచేసింది. ఇక ఈ ఓటమిని అసలు జీర్ణించుకోలేకపోతున్నారు టీమిండియా ఫ్యాన్స్. అయితే భారత ఆటగాళ్లు అనవసర ప్రయోగాలు చేయడం ఇక గెలుపు పై దృష్టి పెట్టకుండా రిలాక్స్ అవడం కారణంగానే ఇలాంటి ఓటమి తప్పలేదు అంటూ విమర్శలు వస్తూ ఉన్నాయి. ఇక ఇలాంటి విమర్శలు గురించి షాకింగ్ కామెంట్స్ చేశాడు కెప్టెన్ రోహిత్ శర్మ. తాము రిలాక్స్ అయ్యాము అంటూ వస్తున్న కామెంట్స్ పై స్పందిస్తూ.. ఇది ఒక పెద్ద జోక్. భారత్ కు ఆడుతున్నప్పుడు రిలాక్స్ అనేది ఎప్పుడు ఉండదు అంటూ స్పష్టం చేశాడు. అయితే ఈ వన్డే సిరీస్ లో మెరుగైన ప్రదర్శన చేయలేదని అంగీకరించిన రోహిత్ శర్మ.. ఈ ఓటమితో ప్రపంచం ఏం అంతం కాదని అసహనం వ్యక్తం చేశాడు.

## మాజీ ప్లేయర్ షాకింగ్ కామెంట్స్?



ప్రస్తుతం భారత జట్టు శ్రీలంక పర్యటనలో ఉంది అన్న విషయం తెలిసిందే. ఇక ఈ పర్యటనలో భాగంగా ప్రస్తుతం వరుసగా సిరీస్ లు ఆడుతూ అదరగొడుతుంది. అయితే సూర్య కుమార్ యాదవ్ కెప్టెన్సీలో బరిలోకి దిగిన టీమిండియా టి20 సిరీస్ ను గెలుచుకుంది అని చెప్పాలి. ఇక ఇప్పుడు రోహిత్ శర్మ కెప్టెన్సీ లో వన్డే ఫార్మాట్లో బరిలోకి దిగింది. ఈ క్రమంలోనే గత కొన్ని దశాబ్దాల నుంచి శ్రీలంకపై ఇండియా వన్డే ఫార్మాట్లో పూర్తి ఆధిపత్యం కొనసాగిస్తూ ఉండగా.. ఇక ఈసారి కూడా భారత జట్టుదే పైచేయి అని అందరూ అనుకున్నారు. కానీ ఊహించని రీతిలో గెలవాల్సిన రెండు మ్యాచుల్లోనూ అటు టీమ్ ఇండియాకు చేదు అనుభవం ఎదురయింది అని చెప్పాలి. ఎందుకంటే అటు మొదటి ఎఖుఎష్ట్ర లో ఒక్క పరుగు తేడాతో మ్యాచ్ టైగా ముగిసింది. దీంతో గెలవాల్సిన మ్యాచ్ ని గెలవలేకపోయింది. ఇక ఆ తర్వాత రెండు వన్డే మ్యాచ్లలో చెత్త ప్రదర్శన కారణంగా ఓటమిపాలు అయింది అని చెప్పాలి. దీంతో శ్రీలంకతో పోల్చి చూస్తే వెనకబడిపోయింది టీమిండియా. కాగా నేడు మూడో వన్డే మ్యాచ్ జరగబోతుంది. ఇక ఈ మ్యాచ్ లో భారత జట్టు గెలుస్తుందా లేదా అనే విషయంపై అందరిలో ఉత్కంఠ ఉంది అని చెప్పాలి. ఇలాంటి పరిస్థితుల మధ్య టీమిండియా మాజీ బౌలర్ ఆశిష్ నెహ్రా భారత జట్టులో సీనియర్ ప్లేయర్లుగా కొనసాగుతున్న రోహిత్ కోహ్లీల గురించి ఆసక్తికర వ్యాఖ్యలు చేశాడు. శ్రీలంకతో జరుగుతున్న వన్డే సిరీస్ లో విరాట్ కోహ్లీ రోహిత్ శర్మలు ఆడాల్సిన అవసరం లేదు అంటూ మాజీ బౌలర్ ఆశిష్ నెహ్రా అభిప్రాయం వ్యక్తం చేశాడు. యువ ఆటగాళ్లకు ఛాన్స్ ఇవ్వడానికి ఇది ఒక మంచి అవకాశం అంటూ చెప్పుకొచ్చాడు. విరాట్ కోహ్లీ రోహిత్ శర్మల గురించి అటు కొత్త కోచ్ గౌతమ్ గంభీర్ కు తెలియనిది ఏముంది. అతను ఏమీ విదేశీ కోచ్ కాదు కదా.

## వన్డే సిరీస్ చేజారె..



27ఏళ్ల తర్వాత శ్రీలంకకు వన్డే సిరీస్ కొలంబో: శ్రీలంక జట్టు 27ఏళ్ల తర్వాత భారత్‌పై స్వదేశంలో వన్డే సిరీస్‌ను చేజిక్కించుకుంది. బుధవారం జరిగిన మూడో, చివరి వన్డేలో టీమిండియా 110 పరుగుల తేడాతో ఓటమిపాలైంది. తొలిగా బ్యాటింగ్‌కు దిగిన శ్రీలంక జట్టు నిర్ణీత 50 ఓవర్లలో 7వికెట్ల నష్టానికి 248పరుగులు చేయగా.. ఛేదనలో భారత్ 26.1ఓవర్లలో 138పరుగులకే కుప్పకూలింది. దీంతో మూడు వన్డేల సిరీస్‌ను శ్రీలంక జట్టు 20తో చేజిక్కించుకోగా.. తొలి వన్డే టై అయ్యింది. శ్రీలంక ఓపెనర్లు అవిష్క ఫెర్నాండో(94), పథుమ్ నిశాంక(45)లు శ్రీలంకకు శుభారంభమిచ్చినా మిడిలార్డర్ చేతులెత్తేశారు. ఆఖర్లో కుశాల్ మెండిస్(59), కమిండ్ మెండిస్(23 నాటౌట్)లు ధనాధన్ ఆడారు. దాంతో, శ్రీలంక పోరాడగలిగే స్కోర్ చేయగలిగింది. రియాన్ పరాగ్‌కు మూడు, సిరాజ్, అక్షర్, సుందర్, కుల్దీప్‌కు ఒక్కో వికెట్ దక్కాయి. లంక నిర్దేశించిన 249 పరుగుల ఛేదనలో ఓపెనర్లు రోహిత్ శర్మ(35), శుభ్‌మన్ గిల్(6)లు స్వల్ప స్కోర్‌కే వెనుదిరిగారు. అవిష్క ఫెర్నాండో ఓపెనర్ గిల్‌ను బౌల్డ్ చేసి 37 పరుగుల వద్ద తొలి వికెట్ తీశాడు. ఆ తర్వాత దునిత్ వెల్లలాగే(5/27) స్పిన్ మాయ చేస్తూ హిట్‌మ్యాన్ వికెట్ తీసి లంకను పోటీలోకి తెచ్చాడు. దాంతో 53కే రెండు వికెట్లు కోల్పోయిన భారత్‌ను విరాట్ కోహ్లీ(20), పంత్‌లు ఆదుకునే ప్రయత్నం చేశారు. కానీ, థీక్షణ బౌలింగ్‌లో పంత్ స్టంపౌట్ కాగా పవర్ ప్లేలో మూడు వికెట్లు కోల్పోయింది. తీక్షణ, ఛరితకు రెండేసి, ఫెర్నాండోకు ఒక వికెట్ దక్కాయి. ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ ఫెర్నాండోకు సిరీస్ వెల్లెలగేకు లభించాయి.

## వెయిట్ లిఫ్టింగ్ పోటీలో నాలుగో స్థానంలో నిలిచిన మీరాబాయి చాను..!




పారిస్ ఒలింపిక్స్ 2024లో భారత స్టార్ వెయిట్‌లిఫ్టర్ మీరాబాయి చాను 49 కిలోల వెయిట్ విభాగంలో పతకం గెలవలేక పోయింది. మొత్తం 199 కిలోల బరువును ఎత్తి నాలుగో స్థానంలో నిలిచింది. భారత్ నుంచి 2 ఒలింపిక్ పతకాలు సాధించిన తొలి వెయిట్‌లిఫ్టర్ రికార్డును ఆమె తృటిలో తప్పించుకుంది. ఈ ఈవెంట్‌లో చైనాకు చెందిన హౌ జిహుయ్ ఒలింపిక్ రికార్డుతో బంగారు పతకాన్ని గెలుచుకుంది. చాను తన మొదటి స్నాచ్ ప్రయత్నంలోనే 85 కిలోల బరువును సులభంగా ఎత్తింది. దీని తర్వాత తన రెండవ ప్రయత్నంలో ఆమె 88 కిలోల బరువును ఎత్తలేకపోయింది. తన మూడో స్నాచ్ ప్రయత్నంలో 88 కిలోల బరువును విజయవంతంగా ఎత్తింది. క్లీన్ అండ్ జెర్క్‌లో అతను 111 కిలోల బరువుతో తన మొదటి విఫల ప్రయత్నం చేసింది. దీని తర్వాత ఆమె తన రెండో ప్రయత్నంలో 111 కిలోలు ఎత్తడంలో విజయం సాధించింది. చివరి ప్రయత్నంలో ఆమె 114 కిలోలు ఎత్తలేకపోయింది. జిహుయ్ మొత్తం 206 కిలోల బరువును ఎత్తి బంగారు పతకాన్ని గెలుచుకుంది. పతకం కోసం బలమైన పోటీదారుగా పరిగణించబడుతున్న జిహుయ్ క్లీన్ అండ్ జెర్క్‌లో 117 కిలోల బరువును ఎత్తి సరికొత్త ఒలింపిక్ రికార్డును నమోదు చేసింది. రోమేనియాకు చెందిన మిహేలా కాంబెయ్ మొత్తం 205 కిలోల బరువును ఎత్తి రజత పతకాన్ని గెలుచుకుంది. ఈ ఈవెంట్‌లో థాయ్‌లాండ్‌కు చెందిన సురోద్చన ఖంబావో 199 కేజీలతో కాంస్యం సాధించింది. చాను నుంచి ఆమె అతి తక్కువ తేడాతో గెలుపొందింది.

## వినేష్ ఫోగట్ సంచలన నిర్ణయం..



ప్రముఖ మహిళా రెజ్లర్ వినేష్ ఫోగట్ సంచలన నిర్ణయం తీసుకున్నారు. ఆమె రెజ్లింగ్ నుంచి తన రిటైర్మెంట్‌ను ప్రకటించారు. మహిళల 50 కేజీల ఫ్రీస్టైల్ రెజ్లింగ్ ఈవెంట్‌లో ఫైనల్ మ్యాచ్‌కు అతిచేరువలో ఉండగా బుధవారం ఉదయం ఆమెపై పారిస్ ఒలింపిక్స్ నుంచి అనర్హత వేటు పడింది. దీంతో తీవ్ర ఆవేదనకు లోనైన వినేష్ , ఇక రెజ్లింగ్ నుంచి రిటైర్ కావాలని డిసైడయ్యారు. "రెజ్లింగ్ నాతో మ్యాచ్ గెలిచింది. నేను మాత్రం ఓడిపోయాను. నా ధైర్యమంతా విరిగిపోయింది. నాకు ఇప్పుడు బలం లేదు. కుస్తీకి(2001-2024) ఇక వీడ్కోలు . నేను ఎప్పటికీ మీకు రుణపడి ఉంటాను" అని తన ఎక్స్ పోస్టులో వినేష్ ఫోగట్ ఉద్వేగంగా రాసుకొచ్చారు. ఇక రెజ్లింగ్‌కు అల్ విదా చెప్పారు. గురువారం తెల్లవారుజామున 5 గంటల 17 నిమిషాలకు ఈ పోస్ట్ పెట్టారు. మహిళల 50 కేజీల ఫ్రీస్టైల్ రెజ్లింగ్ ఈవెంట్‌లో పాల్గొనే రెజ్లర్ల బరువు ఉండాల్సిన దాని కంటే 100 గ్రాములు ఎక్కువ బరువుతో వినేష్ ఉన్నారని నిపుణులు గుర్తించారు. దీంతో ఆమె ఫైనల్ మ్యాచ్‌లో పాల్గొనకుండా అనర్హత వేటు వేశారు. అకస్మాత్తుగా ఫైనల్ మ్యాచ్‌కు ముందు ఇలా జరగడంతో భారత్‌లో క్రీడా ప్రియులంతా షాక్‌కు గురయ్యారు. ఈ నిర్ణయం అన్యాయమైందని అభిప్రాయపడ్డారు. ఈ తరుణంలో వినేష్‌కు నైతిక మద్దతు తెలుపుతూ, ఆమెలో ఆత్మస్థైర్యం నిలిపేలా ప్రధానమంత్రి నరేంద్రమోడీ, రాష్ట్రపతి ద్రౌపది ముర్ము, ఉప రాష్ట్రపతి జగదీప్ ధన్‌కర్ సహా ఎంతోమంది ప్రముఖులు ట్వీట్స్ చేశారు. ప్రజల మనసుల్లో వినేష్ ఛాంపియన్‌గానే ఉంటారని వారు పేర్కొన్నారు.

తెలుగు దినపత్రిక
పీపుల్స్ మోటివేషన్
People's Motivation

## మిస్టర్ బచ్చన్..కొత్త ప్రపంచంలోకి వెళతారు

**దర్శకుడు హరీష్ శంకర్ వెల్లడి**

హరీశ్ శంకర్ దర్శకత్వంలో మాస్ హీరో రవితేజ నటించిన చిత్రం 'మిస్టర్ బచ్చన్' భారీ అంచనాల మధ్య ఆగస్టు 15న ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ నేపథ్యంలో హరీశ్ శంకర్ వరుస ఇంటర్వ్యూలు ఇస్తూ సినిమా విశేషాలను పంచుకుంటున్నారు. 'బాలీవుడ్ మూవీ 'రైడ్'కు రీమేక్‌గా 'మిస్టర్ బచ్చన్' తెరకెక్కినప్పటికీ ఒరిజినల్ కథకు దీనికీ పోలిక ఉండదు. 70 శాతం మార్పులు చేశాం. లవ్ స్టోరీ ప్రధానంగా దీన్ని తెరకెక్కించాం. కచ్చితంగా ఈ సినిమా చూసిన ప్రతి ఒక్కరూ ఓ కొత్త ప్రపంచంలోకి వెళ్తారు. హీరో చాలా ఎనర్జిటిక్‌గా ఉంటాడు. పాటలు కలర్‌ఫుల్‌గా ఉంటాయి. డైలాగులు ఎప్పటికీ గుర్తుపెట్టుకునేలా ఉంటాయని చెప్పారు. ఇక పవన్ కల్యాణ్‌తో తీస్తోన్న 'ఉస్తాద్ భగత్‌సింగ్' గురించి మాట్లాడుతూ ఆ సినిమా ప్రారంభించిన సమయంలో తనపై వచ్చిన ట్రోలింగ్‌పై స్పందించారు. 'తెరీ' రీమేక్ (ఉస్తాద్ భగత్‌సింగ్) ఆపేయమని నన్ను ట్రోల్ చేస్తూ 2లక్షల 68వేల నెగెటివ్ ట్వీట్స్ వచ్చాయి. రికార్డు ఇది. ఏ దర్శకుడి మీద ఈ స్థాయిలో ట్రోలింగ్ ఎటాక్ జరగలేదు. అయినా నేను సినిమా తీయడం ఆపలేదు. ఆ టీజర్ విడుదలయ్యాక నన్ను ట్రోల్ చేసిన వాళ్లందరూ సారీ చెప్పారు' అని హరీశ్ శంకర్ అన్నారు. ఇక ఇటీవల తాను పవన్ కల్యాణ్‌ను కలిసినట్లు ఆయన వెల్లడించారు. సినిమాలు పూర్తిచేయాలనే సంకల్పంతో ఉన్నారని.. త్వరలోనే దీని మిగిలిన షూటింగ్‌ను ప్రారంభిస్తామన్నారు.




## నాగచైతన్య, నటి శోభితా ధూళిపాళ్ల నిశ్చితార్థం



**వివరాలు వెల్లడించిన తండ్రి నాగార్జున**

టాలీవుడ్ హీరో నాగచైతన్య , నటి శోభితా ధూళిపాళ్ల నిశ్చితార్థం జరిగింది. దీనికి సంబంధించిన ఫొటోలను నటుడు నాగార్జున సోషల్‌మీడియాలో పంచుకున్నారు. నా తనయుడు నాగచైతన్య, శోభితా ధూళిపాళ్ల నిశ్చితార్థం ఈరోజు ఉదయం 9.42 గంటలకు జరిగింది. ఈ విషయాన్ని మీ అందరితో పంచుకోవడం సంతోషంగా ఉంది. మా కుటుంబంలోకి ఆమెను సంతోషంగా ఆహ్వానిస్తున్నాం. నూతన జంటకు నా అభినందనలు. వీరి జీవితం సంతోషం, ప్రేమతో నిండాలని కోరుకుంటున్నా 8.8.8 అనంతమైన ప్రేమకు నాంది అని నాగార్జున పేర్కొన్నారు. దీనిపై పలువురు నెటిజన్లు స్పందించారు. కొత్త జంటకు శుభాకాంక్షలు తెలిపారు. నాగచైతన్యకు గతంలో నటి సమంతతో పెళ్లయ్యాక కొంతకాలానికి వ్యక్తిగత కారణాల వల్ల వారిద్దరూ విడిపోయారు. చై-శోభిత ఎంతోకాలం నుంచి స్నేహితులుగా ఉన్నారు. ఇక సినిమాల విషయానికి వస్తే.. శోభిత ధూళిపాళ్ల 2013లో ఫెమినా మిస్ ఇండియా టైటిల్ విన్నర్‌గా నిలిచారు. 2016లో సినీ రంగంలోకి ప్రవేశించారు. ప్రస్తుతం టాలీవుడ్, బాలీవుడ్‌తో పాటు హాలీవుడ్‌లోనూ వరుస అవకాశాలు అందుకుంటున్నారు. నాగచైతన్య 'తండేల్'తో బిజీగా ఉన్నారు. చందూ మొండేటి దర్శకత్వంలో ఇది రూపొందుతోంది.

## ఆ కథ నాకోసమే రాసినట్లుగా ఉంది: తాప్సీ

హసీన్ దిల్‌రుబా'తో 2021లో విజయాన్ని అందుకున్నారు నటి తాప్సీ ఇప్పుడు దీనికి కొనసాగింపుగా తెరకెక్కిన 'ఫిర్ ఆయీ హసీన్ దిల్‌రుబా' విడుదలకు సిద్ధంగా ఉంది. ఈనేపథ్యంలోనే తాప్సీ తాజాగా ఓ ఇంటర్వ్యూలో పాల్గొన్నారు. 'హసీన్ దిల్‌రుబా'లో హీరోయిన్ పాత్ర కోసం మొదట వేరే నటిని అనుకున్నారని చెప్పారు. అనుకోని కారణాల వల్ల ఆమె సినిమాలో నటించకపోవడంతో.. తాను ఆ ప్రాజెక్ట్‌లో భాగమయ్యానని చెప్పారు. తానొక విభిన్నమైన కథతో సినిమా చేయాలనుకుంటున్నానని దర్శకురాలు కనికా ధిల్లాన్ ఓసారి నాకు చెప్పారు. ఆ కథ వినేందుకు నేనెంతో ఆసక్తిగా ఉన్నానని ఆమెకు తెలియజేశా. అదే సమయంలో నేను వేరే సినిమా షూటింగ్‌లో బిజీ అయ్యా. ఆ షూట్ పూర్తయ్యేసరికి.. కనికా వేరే నటిని సంప్రదించినట్లు తెలిసింది. వారిద్దరి మధ్య ఒప్పందం కుదిరిందని త్వరలో ఆ సినిమా పట్టాలెక్కనున్నట్లు వార్తలు వచ్చాయి. కొన్ని నెలల తర్వాత కనికా ఫోన్ చేసి.. ఎందుకు? ఏమిటి? అని ప్రశ్నించకుండా స్క్రిప్ట్ నరేషన్ కోసం ఆఫీస్‌కు రమ్మని పిలిచింది. స్క్రిప్ట్ విన్న వెంటనే ఈ కథ నాకోసమే రాసినట్లు అనిపించింది. వెంటనే ఆ ప్రాజెక్ట్‌కు ఓకే చెప్పా' అని తాప్సీ చెప్పారు. ఇందులో తాప్సీ నెగెటివ్ షేడ్స్ ఉన్న పాత్రలో యాక్ట్ చేశారు. 2021లో నెట్‌ఫ్లిక్స్ వేదికగా విడుదలైన ఈ చిత్రం మంచి విజయాన్ని అందుకుంది. ఇప్పుడీ చిత్రానికి కొనసాగింపుగా సిద్ధమైన 'ఫిర్ ఆయీ హసీన్ దిల్‌రుబా' ఆగస్టు 9న విడుదలకు సిద్ధంగా ఉంది. విక్రాంత్ మస్సే, సన్నీ కౌశల్ ప్రధాన పాత్రల్లో కనిపించనున్నారు.



## ఎన్నో సినిమా షూటింగ్‌లకు సజీవ సాక్ష్యం

**గోదావరి ఒడ్డున నేలగొరిగిన 150 ఏళ్ల నాటి చెట్టు**



గోదావరి నది వరద ఉధృతికి సినిమా చెట్టు (కుమారదేవం చెట్టు) ఇటీవల నేలకొరిగిన విషయం తెలిసిందే. తూర్పుగోదావరి జిల్లా కొవ్వూరు మండలం కుమారదేవం గ్రామంలో గోదావరి నది తీరాన ఉన్న 150 సంవత్సరాల చరిత్ర కలిగిన గన్నేరు చెట్టు ఇది. టాలీవుడ్‌లో దాదాపు 300కి పైగా సినిమాలు ఈ చెట్టు కింద షూటింగ్ జరుపుకున్నాయని.. దిగ్గజ దర్శకులు వంశీ, కె విశ్వనాథ్, జంధ్యాల, బాపు, రాఘవేంద్ర రావు తమ సినిమాల్లో ఈ చెట్టుని వాడినట్లు స్థానికులు చెబుతుంటారు. చివరిగా ఇక్కడ రామ్ చరణ్ నటిస్తున్న గేమ్ ఛేంజర్ షూటింగ్ ఇక్కడ జరుపుకున్నట్లు సమాచారం. చాలా సినిమాలను ఈ చెట్టు కింద తీయడం వలన దీనిని సినిమా చెట్టు అంటారని.. నిర్మాతలకు, దర్శకులకు వారి సినిమాలో ఈ చెట్టును చూపించి నట్లయితే ఆ సినిమా విజయం సాధిస్తుందని అప్పట్లో నమ్మకం ఉండేదని సమాచారం. అయితే ఈ చెట్టు కూలిపోవడంతో కుమారదేవం ప్రజలతో పాటు సినీ ప్రియులు ఆవేదన చెందుతున్నారు. ఆధునిక పద్ధతులను ఉపయోగించి చెట్టుని ఎలాగైనా బ్రతికించండి అంటూ ఏపీ ప్రభుత్వాన్ని వేడుకుంటున్నారు. ఇక దర్శకుడు వంశీకి అయితే ఈ చెట్టుతో ప్రత్యేక అనుబంధం ఉంది. చిన్నప్పుడు ఇక్కడే వంశీ అడుకునేవాడని గ్రామస్థులు చెబుతున్నారు. అయితే తాజాగా ఈ చెట్టు కూలిన విషయాన్ని తెలుసుకున్న దర్శకుడు వంశీ చెట్టుని సందర్శించాడు. గోదావరి వరద ఉధృతికి చెట్టు కూలిపోవడంతో వంశీ బోరుమని ఏడ్చినట్లు సమాచారం. అయితే తాను చెట్టు చివరచూపు కోసం ఇక్కడికి వచ్చానని చెట్టు కూలిపోవడం చాలా బాధగా ఉందని వంశీ తెలిపాడు.

## పవన్ అద్భుతాలు సృష్టిస్తారు

**నటి శ్రియ ఆసక్తికర కామెంట్స్**

ఆంధ్రప్రదేశ్ డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ ను ఉద్దేశించి నటి శ్రియ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. హైదరాబాదులోని ఓ షాపింగ్‌మాల్ ప్రారంభోత్సవంలో పాల్గొన్న ఆమె.. రానున్న రోజుల్లో పవన్‌కల్యాణ్ అద్భుతాలు సృష్టిస్తారని అన్నారు. ఇటీవల జరిగిన ఎన్నికల్లో పవన్‌కల్యాణ్ అద్భుతమైన విజయం అందుకున్నారు. ఆయన విషయంలో నేనెంతో గర్వంగా ఉన్నా. మేమిద్దరం గతంలో 'బాలు' కోసం కలిసి వర్క్ చేశాం. ఆయన చాలా సైలెంట్‌గా ఉంటారు. శ్రమపడే మనస్తత్వం కలిగిన వ్యక్తి. ఆ సినిమాలోని ఓ పాట చిత్రీకరణ సమయంలో ఆయన కాలికి గాయమైంది. పాట షూట్ పూర్తయ్యేవరకూ ఆ విషయాన్ని ఎవరితోనూ చెప్పలేదు. ప్రజలకు మంచి చేయాలని ఎప్పుడూ తాపత్రయపడేవారు. ప్రజలు ఆయన్ని ఎన్నుకోవడం సంతోషంగా ఉంది. ఆయన అద్భుతాలు సృష్టిస్తారని నేను నమ్ముతున్నా అని శ్రియ తెలిపారు. చిరంజీవితో మరోసారి కలిసి వర్క్ చేయాలనుకుంటున్నానని చెప్పారు. ప్రస్తుతం తాను 'షో టైమ్' అనే కార్యక్రమం కోసం వర్క్ చేస్తున్నానని చెప్పారు. బాలీవుడ్‌లోనూ అవకాశాలు వస్తున్నాయ న్నారు. తెలుగులో తేజ సజ్జా మూవీ కోసం యాక్ట్ చేస్తున్నానన్నారు. సినిమాకు ఇప్పుడు భాషతో సంబంధం లేదని.. కంటెంట్ బాగుంటే ప్రేక్షకులు వీక్షిస్తున్నారని తెలిపారు. టాలీవుడ్, కోలీవుడ్, బాలీవుడ్‌లో ఏ చిత్ర పరిశ్రమ అంటే ఇష్టమని విలేకరి ప్రశ్నించగా.. ఇండియన్ సినిమా అని చెప్పడం తనకు ఇష్టమన్నారు.



Printed, Published and Owned by M.RAMESH, H.No. 87/-569, Ground floor, Madhavanagar, Kurnool City, Kurnool - 518002, Andhrapradesh State, and Printing at PSR Printers, No.87-569, Beside, Chenchureddy Apartment, Madhava nagar,Kurnool - 518002 District, Andhrapradesh, Published from H.No. H.No. 87/-569, Ground floor, Madhavanagar, Kurnool City, Kurnool - 518002, Andhrapradesh, Editor : M.RAMESH, Mob : 8008622746,E-mail : peoplesmotivation22@gmail.com